ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM





ఖమ్మంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఇది రైతు కుటుంబ రుణవిముక్తి పథకం

అర్హత ఉన్న రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- బీఆర్ఎస్, బీజేపీ అబద్ధాల మాటలు నమ్మి ఆగం కావొద్దు
- ప్రతి ఫిర్యాదుదారుడి ఇంటికి వెళ్లి సర్వే చేయిస్తాం
- ఫిర్యాదులన్నింటినీ పరిష్కరించి రుణమాఫీ అమలయ్యేలా చర్యలు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్నది రూ.2లక్షల రైతు కుటుంబ రుణవిముక్తి పథకమని, ప్రతి కుటుబంలో ఒకరికి రూ.2లక్షల రుణమాఫీ చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. సాంకేతిక కారణాలతో కొందరు రైతులకు అర్హత ఉన్నా రణమాఫీ కాలేదని వారి ఫిర్యాదులు పరిష్కరించేందుకు వ్యవసాయాధికారులు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి రుణమాఫీ అమలయ్యేలా చూస్తున్నారని, ఇంతలోనే బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన నేతలు రైతులను పక్కదారి పట్టించే విధంగా తప్పుడు విమర్శలు చేస్తున్నారని, వారి విమర్శలు నమ్మి రైతులు ఆగం కావద్దని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. అధికారంలో ఉన్న పదేళ్లలో రైతులు, వారి సమస్యల గురించి ఏనాడూ మాట్లాడని కేటీఆర్... ఇప్పుడు రైతు రుణమాఫీపై ముఖ్యమంత్రి మీద చీప్‌గా విమర్శలు చేస్తున్నారని, అందువల్ల ముఖ్యమంత్రిగారు అదేవిధంగా సమాధానం చెప్పాల్సి వస్తున్నదని పేర్కొన్నారు.

ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఎలాంటి లాభం చేయకుండా ప్రతిపక్షాలు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నాయని, రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి రైతులు గత ఎన్నికల్లో గుణపాఠం చెప్పినా ఇంకా కనువిప్పు కలగడంలేదన్నారు. రాహుల్‌గాంధీ వరంగల్‌లో ఇచ్చిన మాటమేరకు రూ.2లక్షల రుణమాఫీకి కట్టుబడి మూడు విడతలుగా రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షల లోపు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ఇప్పటికే రాష్ట్రంలో 40బ్యాంకుల నుంచి 5782 బ్రాంచీల ద్వారా 41,78,892 ఖాతాలనుంచి తీసుకున్న రూ.31వేల కోట్ల రుణమాఫీకి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈనెల 15నాటికి రూ.18వేల కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమచేశామని మంత్రి తుమ్మల వివరించారు. రుణమాఫీకి జులై 15న జీవో ఇవ్వడం జరిగిందని, ఇప్పటి వరకు 22 లక్షల ఖాతాల్లోకి రుణమాఫీ జరిగిందని, అయితే కొన్ని తప్పిదాలు, లోపాల వల్ల కొందరు రైతులకు (మిగతా 6వ పేజీలో)



ప్రతిపక్షాలది ఓర్వలేనితనం...

ఒకే నెలలో మూడు దశల్లో రూ.18వేల కోట్లు రైతుల ఖాతాల్లో రుణమాఫీ కింద జమచేయడం రికార్డు అని మంత్రి తుమ్మల తెలిపారు. ఈ పంట కాలంలోనే మిగత సొమ్ముకూడా జమ చేస్తుంటే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్నారు. రైతులకు రుణమాఫీ అని చెప్పి మీరు చేసిన మోసం మరిచిపోలేదని, 40లక్షల మంది రైతుల ఖాతాలుంటే 16లక్షల ఖాతాలకే రుణమాఫీ కొంత వేసి కొంత వేయలేదని, రూ.11వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేసి అదికూడా ఎన్నికల నోటిఫికేషన్ ముందు మాఫీ చేస్తున్నట్టు మోసం చేశారని ఆరోపించారు. ఓఆర్ఆర్‌ను తెగనమ్మి లక్షల కోట్ల ఆదాయానికి గండికొట్టి రుణమాఫీ అని చెప్పి తప్పులు చేశారని, కాగ్ నివేదిక కూడా గత ప్రభుత్వ విధానాన్ని తీవ్రంగా తప్పుపట్టిందని గుర్తు చేశారు.

గత లోపాలు తలెత్తనివ్వం

ప్రతిపక్షపార్టీలు రాష్ట్రంలో జరుగుతున్న రైతు కుటుంబ రుణవిముక్తి పథకం గురించి అవగాహన పెంచుకోవాలని, అందుకు మీకు కావలిస్తే బ్యాంకులు ఇచ్చిన ఖాతాల వివరాలను కూడా అందిస్తామని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీకి కింద కుటుంబాన్ని నిర్ధారించి రుణమాఫీ చేయడం ప్రభుత్వ విధానమని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్దే ప్రక్రియ సాగుతుందని మంత్రి వివరించారు. గతంలో రుణమాఫీ కుటుంబం నిర్ధారించకుండా అసలైన రైతులకు రుణమాఫీకాలేదని, రుణమాఫీ పథకం కూడా విఫలమైందని కాగ్ నివేదికలో చెప్పిన విషయం గత పాలకులు గమనించాలన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో తెల్లకార్డు ఉన్న వారికి కుటుంబ నిర్ధారణ అయింది కాబట్టి రుణమాఫీ అయిందని, కార్డులేకుండా పట్టా భూములు వేరుగా ఉండి రుణం పొంది అర్హత ఉన్న కుటుంబాన్ని గుర్తించి రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ అయినా రాష్ట్రంలో అధికారం కోల్పోయిన పార్టీలు వివరాలు అడిగితే అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.



నేలకొండపల్లిలో రామదాసు ధ్యానమందిరం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

పర్యాటక కేంద్రంగా నేలకొండపల్లి

- రామదాసు జన్మస్థలాన్ని ప్రపంచానికి తెలియచేయాలి
- ధ్యానమందిరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాం 6
- పాలేరు శాసనసభ్యుడు, రెవెన్యూ మంత్రి పొంగులేటి



జమలాపురం పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

జమలాపురం అభివృద్ధికి కృషి

- ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకుంటాం 6
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఎర్రుపాలెం మండలంలో రహదారులకు శంకుస్థాపనలు



హైదరాబాద్‌లో కేంద్ర సంఘం నాయకులను కలిసిన టీఎన్జీవో ఖమ్మం జిల్లా అడ్‌హాక్ కమిటీ నాయకులు

టీఎన్‌జీవో బలోపేతానికి కృషిచేయండి

- ఖమ్మం జిల్లా అడ్‌హాక్ కమిటీకి కేంద్ర సంఘం సూచన
- మర్యాదపూర్వకంగా కలుసుకున్న జిల్లా నాయకులు 6



లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ ఆళ్లపల్లి ఎంపీవో శ్రీనివాస్, మర్కోడు కార్యదర్శి నాగరాజు

బిల్లుల మంజూరుకు లంచం వేధింపులు

- విసిగి వేసారి ఏసీబీని ఆశ్రయించిన మాజీ ఉపసర్పంచ్
- రూ.15వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత
- ఆళ్లపల్లి ఎంపీవో శ్రీనివాస్, మర్కోడు కార్యదర్శి నాగరాజుల ఆటకట్టు

ఆళ్లపల్లి, ఆగస్టు 21: భద్రాద్రి జిల్లా ఆళ్లపల్లి మండలంలో బుధవారం ఇద్దరు ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుపడ్డారు. ఆళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీవో బత్తిని శ్రీనివాస్, మర్కోడు పంచాయతీ కార్యదర్శి నాగరాజు బిల్లుల చెల్లింపు విషయంలో మర్కోడు మాజీ ఉపసర్పంచ్ కుర్ర కమల నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్టు ఖమ్మం ఏసీబీ డీఎస్పీ రమేష్ వెల్లడించారు. మర్కోడు మాజీ ఉప సర్పంచ్ కుర్ర కమల గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు చేయగా, ఆయా పనుల బిల్లులతోపాటు, ఇకపై చేయబోయే పనుల తీర్మానాలకు కొంత కమీషన్ చెల్లించాలని ఎంపీవో శ్రీనివాస్, మర్కోడు కార్యదర్శి నాగరాజు డబ్బు డిమాండ్ చేశారు. దాంతో మాజీ ఉపసర్పంచ్ కమల ఏసీబీ అధికారులను ఆశ్రయించగా పథకం ప్రకారం బుధవారం వారు ఆళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవో, కార్యదర్శులను రూ.15వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. పంచనామ నిర్వహించి వారిపై కేసు నమోదు చేసినట్టు వారు తెలిపారు.

విద్యార్థి జేబులో గంజాయి



- చుంచుపల్లి జూనియర్ కాలేజీలో కలకలం
- పోలీస్‌స్టేషన్‌కు ఇద్దరు విద్యార్థుల తరలింపు

చుంచుపల్లి, ఆగస్టు 21: కళాశాల విద్యార్థి జేబులో గంజాయి పొట్లం లభ్యమైన సంఘటన బుధవారం భద్రాద్రి జిల్లాలోని చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలకలం రేపింది. కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భారత్‌బంద్ నేపథ్యంలో కళాశాలలో 700 మంది విద్యార్థులకుగాను బుధవారం 150మంది మాత్రమే హాజరయ్యారని, ఈ క్రమంలో కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి టాయిలెట్స్ ప్రాంతం వైపునకు వెళ్లగా అతడితో పాటు ముగ్గురు వ్యక్తులు అక్కడే ఉండి ఎంతకీరాకపోవడంతో ప్రిన్సిపాల్ గమనించి సిబ్బందిని పంపించారు. దాంతో భయపడ్డ ఆ నలుగురు విద్యార్థుల్లో ఇద్దరు పారిపోయారు. ఇద్దరిని సిబ్బంది పట్టుకున్నారు. వారిలో ఒకరు కళాశాల విద్యార్థి కాగా మరొకరు ఓ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిగా గుర్తించి ఆరా తీశారు. కళాశాల విద్యార్థి జేబులో గంజాయి పొట్లం ఉండటంతో కళాశాల సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు ఆ ఇద్దరు విద్యార్థులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారని ప్రిన్సిపాల్ తెలిపారు. అనంతరం ఆ విద్యార్థుల తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి హెచ్చరించినట్లు కొత్తగూడెం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు.

మధిర చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు



వంగవీడు స్టేజి వద్ద మధిర- వైరా ప్రధాన రహదారిపై మార్కింగ్ చేసిన దృశ్యం

- వేగంగా కొనసాగుతున్న సర్వే పనులు
- 100 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం
- మొత్తం 34 కి.మీ. రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు
- తొలిదశలో 13 కి.మీ. నిర్మాణానికి మార్కింగ్
- పదేళ్ల క్రితం నాటి భట్టి ఆలోచనకు ఎట్టకేలకు కార్యరూపం
- సర్వే అనంతరం నిర్మాణ వ్యయంపై అంచనాలు

మధిర టౌన్, ఆగస్టు 21: మధిర పట్టణం చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు సర్వే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 15 ఏళ్ల క్రితం మధిర నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన సందర్భంలో మల్లు భట్టి విక్రమార్క చేసిన ఆలోచనను ఆచరణలోకి తీసుకువచ్చేందుకు అధికారులు వడివడిగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మధిరలోని ఆర్వోబీతో పాటు మార్గం మధ్యలో ఏవైనా అవాంతరాలు సంభవిస్తే ప్రత్యామ్నాయం లేక పోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో దశాబ్దం క్రితం ఆనాడు ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు ఆలోచన చేశారు.

మధిర పట్టణం చుట్టూ నిర్మాణం అయ్యే ఈ ఔటర్ రింగ్ రోడ్డు మధిర-వైరా ప్రధాన రహదారిలో వంగవీడు స్టేజి నుంచి వంగవీడు, నక్కలగరుబు, బయ్యారం, మడుపల్లి, రాయపట్నం, దెందుకూరు, నిధానపురం, మాటూరు, ఆత్కూరు గ్రామాల పైనుంచి సాగుతూ తిరిగి వంగవీడు స్టేజి వద్ద కలిసేలా 34 కి.మీ. నిడివితో ఏర్పాటు చేసేలా ఓ ప్రైవేటు ఏజెన్సీతో ప్రాథమిక సర్వే చేయించారు.

ఈ రోడ్డును రెండు భాగాలుగా విభజించారు. మొదటి భాగంలో వంగవీడు స్టేజి నుంచి మధిర- కంచికచర్ల, విజయవాడ ప్రధాన రహదారిని కలిపేలా దెందుకూరు సమీపంలోని నిధానపురం క్రాస్ రోడ్డు వరకు 13 కి.మీ. రోడ్డు నిర్మాణానికి భూసేకరణ కోసం ప్రైవేటు ఏజెన్సీ సర్వే పనులు చేపట్టింది. ఇప్పటికే వంగవీడు స్టేజి నుంచి నాలుగు కిలోమీటర్ల మేర 120 అడుగుల వెడల్పుతో రైతుల భూముల్లో మార్కింగ్ చేశారు. మరో నాలుగు రోజుల్లో నిధానపురం క్రాస్ రోడ్డు వరకు సర్వే పనులు పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత మండల రెవెన్యూ, సర్వే అధికారులు ఏఏ సర్వే నెంబర్ల నుంచి ఎంతెంత భూమి సేకరించాల్సి ఉందో మరోసారి సర్వే చేసి లెక్క తేల్చనున్నారు.

భూ సేకరణే ప్రధాన సమస్య...

ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ ప్రధాన సమస్య కానున్నది. ఈ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని కొన్ని గ్రామాల నుంచి ఇప్పటికే అమరావతి-నాగపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం భూములు ఇచ్చిన రైతులు... మరోసారి భూములు ఇచ్చేందుకు అంగీకరిస్తారా.. లేదా.. అనేది తేలాల్సి ఉంది. ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి దాదాపు 250 ఎకరాలు భూ సేకరణ చేయాల్సి ఉంది. ఇదే పెద్ద సమస్యగా మారనుంది. దీనికి తోడు రెండు రైల్వే క్రాసింగ్ బ్రిడ్జిలు, వైరా నదిపై మరో రెండు బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని తొలి విడతలో ఎటువంటి రైల్వే క్రాసింగ్‌లు, బ్రిడ్జిలు లేని మార్గమైన వంగవీడు క్రాస్ రోడ్డు నుంచి నిధానపురం క్రాస్ రోడ్డు వరకు రోడ్డు నిర్మాణానికి సర్వే చేస్తున్నారు. ఈ మార్గంలో చేపట్టే 13 కి.మీ రోడ్డుకు దాదాపు 95 ఎకరాలు భూమి సేకరిస్తే సరిపోతుంది. మొదటి దశలో ఈ 13 కి.మీ. నిర్మిస్తే చాలా వరకు ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలిగే అవకాశం ఉండటంతో సర్వే పనులు వేగంగా సాగుతున్నాయి. మధిర పట్టణానికి ఔటర్ రింగ్ రోడ్డు మణిహారంగా నిలువనుంది. సర్వే అనంతరం భూసేకరణ, రోడ్డు నిర్మాణ వ్యయంపై అంచనాలు రూపొందించనున్నారు.



కొత్తగూడెంలో ఆందోళన చేస్తున్న దృశ్యం

ఎస్సీ వర్గీకరణపై నిరసన

- మాల మహానాడు ఆధ్వర్యంలో కొత్తగూడెంలో ఆందోళనలు

కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలని కోరుతూ మాల మహానాడు ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిరసనలు, ధర్నాలు నిర్వహించారు. బుధవారం పాత ఆర్టీసీ డిపో నుంచి పోస్టాఫీసు సెంటరులోని అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహనికి నివాళ్లర్పించారు. అలాగే జేఏసీ నిర్వహించిన భారత్ బంద్ పిలుపు మేరకు కొత్తగూడెం వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు బంద్ పాటించగా ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎస్.మధుసూదనరావు రిజర్వేషన్ల వర్గీకరణ వల్ల మాలలకు నష్టం జరుగుతుందని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మరోసారి పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. కేటగిరీ బిలో ఉన్న 18 ఉప కులాల్లో మాదిగలే ముందంజలో ఉన్నారని గుర్తు చేశారు. మిగతా 17 ఉప కులాల వారు ఉద్యోగాల్లో ఏడు, విద్యలో రిజర్వేషన్‌లు పొందేస్థాయిలో లేకపోవడం వల్ల వారు సామాజికంగా ఎదగలేకపోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంతోటి పాల్, కూరపాటి రవీందర్, మేరుగు అనసూర్య, గంధం మల్లికార్జున్, నక్కా సృజన, తుంపురు శివ, నవతన్, కనకదుర్గా ప్రసాద్, దార్ల లక్ష్మి, కడెం రాము పాల్గొన్నారు.



గోదావరిలో రామకోటి ప్రతులను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

శ్రీరామకోటి ప్రతుల నిమజ్జనం

- భద్రాద్రిలో శోభాయమానంగా యాత్ర
- గోదారమ్మకు హారతుల సమర్పణ

భద్రాచలం, ఆగస్టు 21: రామ భక్తులు భద్రాద్రి రామయ్యను స్మరిస్తూ రాసిన శ్రీరామకోటి ప్రతులను భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం అధికారులు బుధవారం సంప్రదాయబద్ధంగా పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. శ్రీరామకోటి ప్రతులను లారీల్లో తరలించే ముందు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి పాల్గొన్నారు. అనంతరం మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణ, భక్తుల కోలాటాల నడుమ శ్రీరామ కోటి ప్రతులను భద్రాచలంలోని గోదావరి వారధి మీదకు తీసుకువచ్చారు. అక్కడ మళ్లీ ప్రత్యేక పూజలు నిర్వహించి ముందుగా గోదారమ్మకు ఈవో ఎల్.రమాదేవి పసుపు కుంకుమ, వస్త్రాలను సమర్పించారు. అనంతరం శ్రీరామ కోటి ప్రతులను శిరస్సుపై ధరించి శాస్త్రోక్తంగా గోదావరిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వైదిక సిబ్బంది సంప్రదాయబద్ధంగా గోదారమ్మకు నదీ హారతులను సమర్పించారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు, అమరవాది విజయరాఘవన్ వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు జ్ఞానాన్ని అందించేది ఉపాధ్యాయులే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కొత్తగూడెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కావాల్సిన జ్ఞానాన్ని అందించే బాధ్యత ఉపాధ్యాయులదేనని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను తయారు చేసి వారికి మంచి భవిష్యత్‌ను అందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. జిల్లాలో ఇటీవల పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు రెండురోజులపాటు కొత్తగూడెంలోని జిల్లా విద్యాశిక్షణ కేంద్రంలో నిర్వహించనున్న శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఇప్పటివరకు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కావాల్సిన సామర్థ్యాలు అందించడంలో విశేష కృషి చేశారన్నారు. ప్రస్తుతం పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు ఉన్నత పాఠశాల పరిస్థితులు వేరుగా ఉంటాయన్నారు. దీంతో ఈ శిక్షణ వారికి ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర చారి మాట్లాడుతూ మొదటి విడతలో 130మంది ఇంగ్లీష్, ఫిజిక్స్, సోషల్ సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులకు రెండురోజులపాటు శిక్షణ అందిస్తున్నామని దీనిని సద్వినియోగం చేసుకుని సందేహాలన్నింటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి శిక్షణ సమన్వయకర్తగా జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్ వ్యవహరించగా పదోన్నతి పొందిన 130మంది ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు 14మంది డీఆర్పీలు పాల్గొన్నారు.

నేడు పొదెం వీరయ్యకు
ఆత్మీయ పౌర సన్మానం

హాజరుకానున్న డిప్యూటీ సీఎం, మంత్రులు

భద్రాచలం, ఆగస్టు 21: రాష్ట్ర అటవీ అభివృది సంస్థ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పొదెం వీరయ్యకు భద్రాచలంలో గురువారం ఆత్మీయ పౌర సన్మానం నిర్వహించనున్నారు. భద్రాచలం పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు ఇతర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. వీరయ్య రాకను పురస్కరించుకొని భద్రాచలంలోని గోదావరి వారధి నుంచి కార్యక్రమం జరిగే కేకే ఫంక్షన్‌హాలు వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చట్టవిరుద్ధంగా అబార్షన్లు చేస్తే కఠినచర్యలు

- లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే అనుమతులు రద్దు: కలెక్టర్
- భ్రూణహత్యలు నేరం, రుజువైతే కఠినచర్యలు: జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): భ్రూణహత్యలు నేరమని రుజువైతే కఠినచర్యలు తప్పవని జిల్లా జడ్జి పాటిల్ వసంత్ జిల్లా జడ్జి వసంత్‌పాటిల్ హెచ్చరించారు. ఆడ, మగ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే అనుమతులు రద్దు చేస్తామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. భద్రాద్రి జిల్లా ఐడీవోసీ సమావేశ హాలులో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మహిళా సభ్య అధికార కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా జడ్జి వసంత్‌పాటిల్ మాట్లాడుతూ చట్టవిరుద్ధంగా అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే (పీసీ పీఎన్డీటీ) యాక్టు ప్రకారం ఆయా ఆసుపత్రుల అనుమతులు రద్దుచేయాలని సూచించారు. ఆడ పిల్లలపై జరుగుతున్న దాడులను నిరోధించేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్‌నాయక్, పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్‌కుమార్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్లు చైతన్య, బాలాజీ, డీసీపీవో ఎం.కుమారి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో ప్రారంభం కాని ఓరియంటేషన్ తరగతులు

- భవనాలకు కలెక్టరేట్ నుంచి రాని అనుమతి

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 21: రాష్ట్రంలోని అన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో ఓరియంటేషన్ తరగుతుల ఈనెల 19నుంచి మొదలైనా.. పాలేరు జేఎన్‌టీయూలో మాత్రం ఇంకా ప్రారంభం కాని పరిస్థితి. మొదటి ఏడాదిలో విద్యార్థులు గణనీయంగా చేరినప్పటికీ కళాశాల నిర్వహణ కోసం ఐటీడీఏ భవనాలకు అనుమతి రాలేదు. ఖమ్మం కలెక్టరేట్‌లో గత కొన్నిరోజులుగా ఫైలు పెండింగ్‌లో ఉండడంతో కళాశాల ప్రారంభించని పరిస్థితి. ప్రభుత్వ జేఎన్‌టీయూ కళాశాల అయినప్పటికీ రెవెన్యూ అధికారులు భవనాలకు అనుమతులు ఇచ్చే విషయంలో కొర్రీలు పెడుతున్నట్లు తెలిసింది. గత విద్యాసంవత్సరంలో కౌన్సెలింగ్ చివరి తరుణంలో పాలేరు జేఎన్‌టీయూను గత ప్రభుత్వం మంజూరుచేసిన విషయం విదితమే. గతేడాది సీఎస్ఈ, డేటాసైన్సు కోర్సులు మాత్రమే తరగతులు ప్రారంభించింది. జేఎన్‌టీయూకు స్థలం భవనాలు లేకపోవడంతో భద్రాచలం ఐటీడీఏకు చెందిన ఒకేషనల్ సెంటర్ ట్రైనింగ్ భవనాలు ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లిలో ఉండడండతో గత కలెక్టర్ వీపీ గౌతమ్ ఏడాదిపాటు ఈ భవనాల్లోని కొన్ని గదులు తీసుకునేందుకు అనుమతి ఇచ్చారు. దీంతో జేఎన్‌టీయూ కళాశాల తాత్కాలికంగా ఆ భవనంలోని కొన్ని గదుల్లో మాత్రమే ప్రారంభమైంది. ఈ విద్యాసంవత్సరం సీఎస్ఈ, డైటా సైన్సు, ఈసీఈ, మెకానికల్, ట్రిపుల్‌ఈలో విద్యార్థులు కౌన్సెలింగ్ ద్వారా చేరారు. అన్ని గ్రూపుల్లో విద్యార్థులు 300మందికి సీట్లు కేటాయించడంతో అందరు జాయిన్ అయ్యారు. హాస్టల్‌వసతితో ఇక్కడ కాలేజీ నడపాలన్నా, ల్యాబులు ఏర్పాటు చేయాలన్నా ప్రస్తుతం ఉన్న ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ భవనాలు పూర్తిగా అవసరం ఉంది. విద్యాసంవత్సరం మొదలవుతున్నందున భవనాలకు అనుమతి ఇవ్వాలని జేఎన్‌టీయూ అధికారులు ఖమ్మంకలెక్టరేట్‌లో దరఖాస్తు చేశారు. అయితే కలెక్టరేట్ నుంచి దీనికి అనుమతి రాకపోవడంతో జేఎన్‌టీయూ ఒరియంటేషన్ తరగతులు ప్రారంభంకాలేదు. ప్రస్తుతం భద్రాచలం ఐటీడీఏ పరిధిలో ఉన్న ఈ భవనం మొత్తం జేఎన్‌టీయూకి ఇస్తే దీనికి మరమ్మతులు చేయడంతోపాటు రంగులు వేయడం నీటి సరఫరా వంటి పనులకు వారంరోజులు పట్టే అవకాశం ఉంది. అయితే గతేడాది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వారికి గతంలో కేటాయించిన గదుల్లోనే విద్యాబోధన జరుగుతుంది. ఈభవనాల్లో కళాశాలలో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించేందుకు నిర్వాహణకు అనుమతి ఇస్తే అందులో బెడ్లు ఏర్పాటు, ఎలక్ట్రికల్, వాటర్‌వర్క్స్, హాస్టల్ సదుపాయాలు, ల్యాబులు ఏర్పాటు తదితర సౌకర్యాలను జేఎన్‌టీయూ సమకూర్చాల్సి ఉంది.



జేఎన్‌టీయూ కాలేజీ నిర్వహించే ఒకేషనల్ భవనం

ముువ్వా పద్మావతికి
మంత్రుల నివాళి

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 21: ప్రముఖ కవి విద్యావేత్త ముువ్వా పద్మావతి రంగయ్య ఫౌండేషన్ చైర్మెన్ ముువ్వా శ్రీనివాసరావు మాతృమూర్తి ముువ్వా పద్మావతి ఇటీవల మృతి చెందగా బుధవారం నగరంలోని హరితాగార్డెన్‌లో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి, సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సాగునీటి పారుదల చైర్మెన్ ముువ్వా విజయబాబు హాజరై పద్మావతికి నివాళి అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, ఖమ్మం నగర మేయర్ నీరజ, పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, బాగం హేమంతరావు, పోటు రంగారావు, సాధు రమేష్‌రెడ్డి, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాల సంఘం నాయకులు గుర్రం కాంతారావు, నవీన్‌బాబు, రవిమారుత్, కేసా వీరన్న, టీవీ అప్పారావు, మతిన్, సాంబశివారెడ్డి, తదితరులు పాల్గొని నివాళి అర్పించారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్పొరేటర్లు, నగర ప్రముఖులు, సాహిత్య సంఘాల బాధ్యులు, కవులు, రచయితలు, తదితరులు హాజరై నివాళి అర్పించారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

రామయ్య భూములను వెంటనే
దేవస్థానానికి అప్పగించాలి

భద్రాచలం, ఆగస్టు 21: భద్రాద్రి రామయ్య భూములను వెంటనే దేవస్థానానికి అప్పగించాలని విశ్వహిందూపరిషత్ రాష్ట్ర మందిర అర్చక పురోహిత్ సహ ప్రముఖ్ ఓరుగంటి సురేష్‌కుమార్ అన్నారు. భద్రాచలంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవస్థానానికి చెందిన పురుషోత్తపట్నం గ్రామంలో కొంత మంది స్వార్థపరులు యథేచ్ఛగా స్వామివారి భూములను ఆక్రమించుకుంటున్నారని ఇదే విషయంపై గతంలో యటపాక తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగిందన్నారు. దేవస్థానం నిర్మించే గోశాలను అడ్డుకున్న సమయంలో కూడా వీహెచ్‌పీ ముందుండి పోరాడిందని పేర్కొన్నారు. కొద్ది రోజుల క్రితం ప్రస్తుత దేవస్థానం ఈవో రమాదేవి పురుషోత్తపట్నం వెళ్లి అక్రమ కట్టడాలను ధైర్యంగా అడ్డుకోవడాన్ని పరిషత్ అభినందిస్తుందన్నారు. స్వామి వారి భూములను ఎవరు ఆక్రమించుకోవాలని చూసినా విశ్వహిందూపరిషత్ సహించదని, దీనికోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని పేర్కొన్నారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చొరవ తీసుకొని రామయ్య భూములను భద్రాచలం దేవస్థానానికి అప్పగించాలని డిమాండ్ చేస్తున్నాం. లేకపోతే రెండు తెలుగు రాష్ట్రాల్లోని విశ్వహిందూపరిషత్ కార్యకర్తలు రామయ్య భూముల పరిరక్షణకు మరో ఉద్యమాన్ని చేయాల్సి వస్తుందన్నారు ఈ సమావేశంలో విశ్వహిందూపరిషత్ ఖమ్మం విభాగ సంఘటన కార్యదర్శి దడిదేశి వెంకటేశ్వర్లు, గంగాధరి సీత, చిట్టెంశెట్టి లక్ష్మయ్య, భజరంగ్ దల్ జిల్లా సంయోజక్ మెరుగు చింటేశ్వర్, కొమరాజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



న్యాయం జరిగే వరకు పాఠాలు వినం

కొత్తగూడెం జీజీహెచ్‌లో మెడికల్ విద్యార్థుల నిరసనలు

కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్, ఆగస్టు 21: కలకత్తాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించి మృతురాలికి న్యాయం జరిగే వరకు పాఠాలు వినేది లేదని కొత్తగూడెం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)లో మెడికల్ కళాశాల విద్యార్థులు బుధవారం నిరసన కొనసాగించారు. ఈ సంఘటన జరిగి సుమారు 14 రోజులు గడుస్తున్నా ఇంతవరకు ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం జీర్ణించుకోలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులకు, వైద్యులకు సిబ్బందికి తక్షణమే రక్షణ చట్టాలు రూపొందించాలని భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా కొత్తగూడెం మెడికల్ కళాశాలలో రెండో ఏడాది విద్యనభ్యసించే విద్యార్థులు ఈ నిరసన ధర్నాలో పాల్గొనడం పట్ల అభినందనలు తెలిపారు.

టీఎన్జీవో బలోపేతానికి కృషి చేయండి

- ఖమ్మం జిల్లా ఆడహక్ కమిటీకి కేంద్ర సంఘం సూచన

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 21:టీఎన్జీవోస్ యూనియన్ బలోపేతానికి బాధ్యులంతా చిత్తశుద్ధితో కృషిచేయాలని ఆ సంఘం కేంద్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ముజీబ్ పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా టీఎన్జీవో ఆడహక్ కమిటీ సభ్యులు హైదరాబాద్ లోని కేంద్ర సంఘ భవనంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాధ్యులంతా యూనియన్ ను పటిష్టపరిచేందుకు కృషిచేయాలన్నారు. జిల్లాలో నూతనంగా నియమించిన కమిటీ సమర్ధవంతంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని, అలాగే నిర్ణీత సమయంలో పూర్తిచేసుకొని సమర్ధవంతమయిన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర నాయకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కన్వీనర్ కొణిదెన శ్రీనివాస్, సభ్యులు కె దుర్గాప్రసాద్, జయపాల్ విజయకుమార్, శ్రీధర్ సింగ్, నాయకులు కిరణ్ రెడ్డి, కొనార్, బిట్టా ప్రవీణ్, బుసా చంద్రశేఖర్, శ్రీకాంత్, పూసపాటి శ్రీనివాస్, రత్నాకర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు..

3500 సభ్యత్వాలే లక్ష్యం

● టీఎన్జీవో అడహక్ కమిటీ కో కన్వీనర్ శ్రీనివాస్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 21: ప్రతి ఉద్యోగినీ కలుస్తాం.. అందరికీ టీఎన్జీవోలో సభ్యత్వాన్ని కల్పిస్తాం.. 3500 మందికి ఈ సారి స్థానం కల్పించాలన్నది లక్ష్యం' అని టీఎన్జీవో అడ్‌హక్ కమిటీ కో కన్వీనర్ కొణిదెన శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉన్న కమిటీని రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రద్దు చేసినట్లు తెలిపారు. కొత్తగా అడ్‌హక్ కమిటీని 9 మందితో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహించి కొత్తగా ఏర్పాటయిన కమిటీ ద్వారా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేయనున్నట్లు తెలిపారు. ప్రధానంగా కొత్తగా విధుల్లో చేరిన వారికి సీపీఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

కేసు ఉపసంహరించుకోవాలని దాడి

● ఆరుగురిపై కేసు నమోదు

పాల్వంచ, అగస్టు 21: తమపై పోలీస్ స్టేషన్‌లో పెట్టిన పాత కేసులను ఉపసంహరించుకోవాలని ఆరుగురు కలిసి ముగ్గురిపై విచక్షణారహితంగా దాడి చేసిన ఘటనపై పాల్వంచ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన మాలోతు భావ్‌సింగ్‌కు అదే గ్రామానికి చెందిన కేలోతు బాలు, వీరు, శ్రీను, గోపి, భూక్యా కవిత, భూక్యా లలితతో విభేదాలు ఉన్నాయి. పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో వారిపై కేసులు కూడా నమోదయ్యాయి. ఈ క్రమంలోనే ఈ నెల 12న తమపై పోలీస్ స్టేషన్‌లో గతంలో పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని వారు ఆరుగురు కలిసి భావ్‌సింగ్‌ను దుర్భాషలాడుతూ, అతడిపై దాడికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న స్థానికులు విజయరామరాజు, విష్ణులు ఇరువర్గాల వారిని శాంతింపజేయడానికి ప్రయత్నించారు. కానీ భావ్‌సింగ్‌కు వత్తాసు పలుకుతున్నారని అపార్థం చేసుకొని ఆరుగురు కలిసి ముగ్గురిపై విచక్షణారహితంగా కర్రలతో దాడి చేసి గాయపరిచారు. గాయపడిన వారు ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం, మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

కబ్జాలకు చెక్ పడేనా!?

- పకడ్బందీగా ఎల్ఆర్ఎస్ మార్గదర్శకాలు
- ప్రత్యేకంగా మొబైల్ యాప్, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సాఫ్ట్‌వేర్
- ఖమ్మం నగర పరిధిలోనే 40 వేల దరఖాస్తులు



ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 21: అభివృద్ధితో పాటు అదే స్థాయిలో ప్రభుత్వ భూముల అక్రమణలు, కబ్జాలు పెరిగిపోతున్న నేపథ్యంలో... ప్రభుత్వం తాజాగా అమలు చేస్తున్న లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) వీటికి ముకుతాడు వేస్తుందా.. అనేది చర్చనీయాంశంగా మారింది. కఠినమైన నిబంధనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎల్ఆర్ఎస్‌ను అమలు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారం లాభాలు కురిపిస్తుండటంతో కాకతీయుల కాలంలో ఖమ్మం నగరంలో నిర్మాణమైన అనేక చెరువులు, కాల్వలు కబ్జాలకు గురవుతున్నాయి. ప్రభుత్వ స్థలాలపై కన్నేసిన అక్రమార్కులు... రెవెన్యూశాఖలోని లోపాలను ఆసరాచేసుకొని పాగా వేశారు. ఇట్లాంటి వారికి ఎల్ఆర్ఎస్ వరంగా మారే ప్రమాదం ఏర్పడింది.

ప్రభుత్వ స్థలాలను నకిలీ కాగితాలతో ఆక్రమించుకుంటున్న వ్యక్తులు... ఎల్ఆర్ఎస్ ద్వారా రెగ్యులరైజ్ చేయించుకొని దర్జాగా అమ్మకాలు జరుపుతున్నారు. వీటిలో చాలా స్థలాలు లోతట్టు భూములు కావటంతో వర్షాకాలంలో మున్సిపాలిటీలు, నగర పాలక సంస్థలకు పెద్ద సమస్యగా మారుతున్నాయి. వర్షపు నీరు కాల్వల ద్వారా చెరువులోకి వెళ్లకుండా ప్రజల నివాసాలు, రహదారుల పైకి చేరుతున్నాయి. వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలు తరుచూ ముంపునకు గురవుతుండటంతో ఇందుకు సాక్ష్యంగా కనిపిస్తోంది. ఖమ్మం నగరంలో కూడా గత ప్రభుత్వ హయాంలో భారీగా భూ అక్రమణలు జరిగాయనే విమర్శలున్నాయి. ఇందుకు సాక్ష్యంగా కాకతీయుల కాలంలో నిర్మాణమైన ఖమ్మం నగరంలోని ఖానాపురం(ఊరచెరువు), లకారం చెరువు, పుట్టకోట చెరువుల కబ్జాలు నిదర్శనంగా కనిపిస్తున్నాయి. చెరువుల శిఖం, కాలువలు ఇప్పటికే అక్రమణకు గురికాగా, వాటికి ఎల్ఆర్ఎస్ ద్వారా రాజముద్ర వేయించుకునేందుకు పలువురు రియాల్టర్లు ఇప్పటికే ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో వందల సంఖ్యలో దరఖాస్తుల సమర్పించినట్టు సమాచారం.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఇలా..

మున్సిపాలిటీ	దరఖాస్తులు
ఖమ్మం నగర పాలక సంస్థ	39,945
ఖమ్మం సుడా	25,476
మధిర	4276
సత్తుపల్లి	3688
వైరా	3516

ఎల్ఆర్ఎస్ మార్గదర్శకాలు

రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో ప్రభుత్వ చెరువులు, కాలువల అక్రమణతో ప్రభుత్వం మేలుకొంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ భూములు, చెరువుల శిఖాలు, కాలువలను కాపాడేందుకు చర్యలను తీసుకొంది. ఈ మేరకు తాజాగా విడుదల చేసిన ఎల్ఆర్ఎస్‌లో కఠినమైన మార్గదర్శకాలను ఏర్పాటు చేశారు. ఎల్ఆర్ఎస్ జారీలో ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3 దశల్లో పరిశీలన ఉంటుంది. ఎల్ 1 విభాగంలో రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్‌శాఖల అధికారులు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుని స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వశాఖల వారీగా వెర్వేరుగా అనుమతులు జారీ చేయాల్సి ఉంటుంది. భవిష్యత్‌లో ఏదైనా ఇబ్బంది కలిగితే తప్పుడు ధృవీకరణ చేసిన అధికార, ఆయా ప్రభుత్వశాఖను బాధ్యత వహించాల్సి ఉంటుంది. గతంలో అయితే ఇరిగేషన్ శాఖ అధికారులు నో డ్యూ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తే మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఎల్ఆర్ఎస్‌ను జారీ చేసే వారు. తర్వాత ఎల్ 2, రెవెన్యూ, ఇరిగేషన్, నగర పాలక సంస్థ పర్యవేక్షణ అధికారులు, ఎల్ 3లో మునిసిపల్ అధికారి ఎల్ఆర్ఎస్ జారీ చేస్తారు.


ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిశీలన కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందించారు. ఎల్ 1 బృందం సభ్యులు దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన సమయంలో ఎంతో కీలకంగా పనిచేస్తొంది. యాప్ ఆన్ చేయగానే సెంట్రల్ గుడ్ గవర్నెన్స్ ద్వారా ఏర్పాటు చేసిన సాఫ్ట్‌వేర్ పనిచేస్తొంది. మొబైల్ యాప్ ఆధారంగా స్థలం నాలుగు వైపులా ఎల్ఆర్ఎస్ యాప్ ఉన్న సెల్‌ఫోన్‌తో నడవటం ద్వారా ఆ స్థలం కొలతలు నమోదు జరుగుతాయి. ఎల్ఆర్ఎస్ ద్వారా అమోద ముద్ర పడిన స్థలానికి జీపీఎస్ ట్యాగింగ్ జరుగుతుంది.

కార్యచరణ ప్రారంభం

ప్రభుత్వ నూతన మార్గదర్శకాలతో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పర్యవేక్షణలో కమిషనర్ అభిషేక్ అగస్త్య ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమానికి ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించారు. ఎల్ 1, ఎల్ 2 బృందాలను ఏర్పాటు చేశారు. దరఖాస్తుల పరిశీలనకై ప్రాంతాలను సెక్టార్లుగా గుర్తించారు. ఒక్క ఖమ్మం నగరంలోనే 18వేల సెక్టార్లను గుర్తించారు. సెక్టార్ వారీగా బృందాలను ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు పంపి ఒకే సమయంలో ఎక్కువ దరఖాస్తులు పరిశీలన పూర్తి జరిగేలా కార్యచరణ రూపొందించారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిదిలోని ఎల్ఆర్ఎస్ ఫిర్యాదుల కోసం నగర పాలక సంస్థ కార్యాలయంలోనే హెల్ప్ డెస్క్, సుడా పరిదిలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు అర్బన్ ఎంపీడీవో కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుకు సిద్దం చేశారు.

జమలాపురం అభివృద్ధికి కృషి

● ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

ఎర్రుపాలెం, ఆగస్టు 21: 'గత పదేళ్లలో అభివృద్ధిలో వెనుకబడిపోయాం.. ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకుంటేనే ముందడుగు వేయగలం... జమలాపురాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసి పర్యాటక చిత్రపటంలో జమలాపురం ఉండేలా చూ స్తాం..' అని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఎర్రుపాలెం మండల పర్యటనలో భాగంగా బుధవారం పలు రోడ్లకు శంకుస్థాపన చేసిన భట్టి జమలాపురంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో జమలాపురం పర్యాటక అభివృద్ధికి త్వరలో భూమి పూజ చేయనున్నట్టు తెలిపారు. మండలంలోని మీనవోలు నుంచి బనిగండ్లపాడు వరకు రూ.కోటి 70లక్షలు, ఎర్రుపాలెం నుంచి పెగళ్లపాడు రోడ్‌వరకు రూ.2కోట్ల40లక్షలు, కొత్తపాలెం నుంచి గట్లగౌరవరం వరకు రూ.20కోట్లు, ఎర్రుపాలెం నుంచి రాజుపాలెం వరకు రూ.25కోట్లు, వెంకటాపురం నుంచి బుచ్చిరెడ్డిపాలెం వరకు రూ.6కోట్లు, బుచ్చిరెడ్డిపాలెం నుంచి వెంకటాపురం వరకు రూ.2కోట్ల 20లక్షలు, నారాయణపురం నుంచి రాజుపాలెంరోడ్డు వరకు రూ.95లక్షలు, రాజుపాలెం నుంచి కొత్తపాలెం వరకు రూ.కోటి 60లక్షలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులకు శంకస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, జేసీ మధుసూదన్‌నాయక్, తహసీల్దార్ మన్నె ఉషాశారద, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, నాయకులు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, మీడియా సెల్ మల్లెల లక్ష్మణరావు, అనుమోలు కృష్ణారావు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా నేలకొండపల్లి

● పాలేరు శాసనసభ్యుడు, రెవెన్యూ మంత్రి పొంగులేటి



పూజలు చేస్తున్న మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి, ఆగస్టు 21: నేలకొండపల్లిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నదని పాలేరు శాసనసభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లిలోని భక్తరామదాసు పుట్టిన ప్రదేశంలో ధ్యాన మందిరాన్ని దాదాపు రూ.3కోట్ల వ్యయంతో నిర్మించిన ఆడిటోరియాన్ని బుధవారం ఉదయం మంత్రి ప్రారంభించారు.

విద్వత్ కళాపీఠం అధ్యక్షుడు సాదు రాధాకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ భక్తరామదాసు ధ్యానమందిర ఆడిటోరియాన్ని ప్రారంభించటం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. బౌద్ధస్థూపం ప్రపంచంలోనే మూడె అతి పెద్దదిగా గుర్తించారన్నారు.

నేలకొండపల్లిని టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దటానికి అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి, ఎంపీ రఘురాంరెడ్డి, రాయల నాగేశ్వరరావులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, వేగినాటి లక్ష్మీనర్సయ్య, మైసా శంకర్, చిట్టూరి అచ్చయ్య, బొడ్డు బొందయ్య, గోళ్ళ శ్రీనివాసరావు, షేక్, ఖాజామియా, మోహన్‌రెడ్డిలతోపాటుగా విద్వత్ కళాపీఠం సభ్యులు సాదు రాధాకృష్ణమూర్తి, మన్నె కోటేశ్వరరావు, నంచర్ల దేవీప్రసాద్, ఓరుగంటి నారాయణరావు, పాల్గొన్నారు.

రావిగూడెంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెర్వుమాధారం లిఫ్టు నుంచి పొలాలకు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో లిఫ్టు చైర్మన్ యలగాల భూషయ్య, ఎంపీ రఘురాంరెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నెల్లూరి భద్రయ్య, ముువ్వా విజయ్‌బాబు, పాల్గొన్నారు.

ఇది రైతు కుటుంబ రుణవిముక్తి పథకం

(5వ పేజీ తరువాయి)

రుణమాఫీ వర్తించలేదని, దీనిని సరిదిద్దేందుకు ఈ నెల 16 నుంచి వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ జరిగేలా సాంకేతిక తప్పిదాలు సవరించి రుణమాఫీ చేసేదుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తెల్లకార్డు లేకపోయినా పట్టా పాస్ పుస్తకం మీద రుణం తీసుకున్న రైతు కుడా అర్హుడన్నారు.

ఈ ప్రక్రియ ఇలా సాగుతుంటే విపక్ష నేతలు, గతంలో అధికారంలో ఉండి రైతుల గురించి మాట్లాడని కేటీఆర్ వంటి నేతలు ఇప్పుడు రైతులను పక్కదారి పట్టించేలా విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. వారి పాలనలో గడిచిన ఐదేళ్ల రైతులకు డ్రిప్ ఇవ్వలేదని, యాంత్రీకరణ పథకాలు అందించలేదని, రాళ్ల వానపడితే అకాలవర్షాలకు పంటలు దెబ్బతింటే పరిహారం ఇవ్వలేదని, ధాన్యం కొనుగోలు పేరుతో 10కేజీల తారం తీసి రైతులకు నష్టం చేశారని, సాగుచేయకపోయినా భూములకు పెట్టుబడి సొమ్ములు ఇచ్చారని, లక్షలోపు రుణమాఫీ చేస్తామని రైతులను ఎన్నో ఇబ్బందులకు గురిచేసి వడ్డీ భారం మోపారని మంత్రి వివరించారు.

అర్హులందరికీ రుణమాఫీ

గతంలో కూడా కుటుంబాలను దృష్టిలో ఉంచుకునే, తెల్లకార్డు ఉన్నవారికే రుణమాఫీ జరిగిందని, తెల్లకార్డు లేని రైతులకు రుణమాఫీ చేయలేదని ఇప్పుడు ఆ పద్ధతి కాకుండా తెల్లకార్డు లేకపోయినా కుటుంబాన్ని గుర్తించి రుణమాఫీ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు కేవలం 39లక్షల మంది రైతుల పేర్లపైనే రుణాలున్నాయని, తాము అధికారంలోకి వచ్చాక గడిచిన ఐదేళ్లలో ఎంత పంట రుణాలు ఉంటే అందరి ఖాతాలు పంపాలని కోరామని, 41,78,892 లక్షల మంది ఖాతాల వివరాలు బ్యాంకులు అందించాయని, విపక్షాలకు కూడా ఈ వివరాలు అందిస్తామన్నారు. అయితే కొన్నిచోట్ల కింది స్థాయి బ్రాంచీల్లో రైతుల వివరాలను రాష్ట్రస్థాయి బ్యాంకర్లకు పంపించలేదని, ఆ సమస్యను ఇప్పుడు కొత్తగా చెబుతున్నారని, అయినప్పటికీ వాటిని కూడా ఫిర్యాదులుగా స్వీకరించి అర్హత ఉండి రుణమాఫీకాని రైతులకు మాఫీ చేస్తున్నామని ఇది రోజువారీగా జరుగుతున్న ప్రక్రియ అని మంత్రి తుమ్మల తెలిపారు.

చిల్లర మాటలతో దిగజారవద్దు..

ప్రతిపక్షంలో కూర్చోబెట్టినప్పటికీ కేటీఆర్ చీప్ చేష్టలతో చిల్లర మాటలతో విమర్శలు చేస్తూ దిగజారుతున్నారని, అందుకే ముఖ్యమంత్రి కూడా చీప్‌గా మాట్లాడవల్సి వస్తున్నదని, ప్రతిపక్షపార్టీ ప్రజలకు ఉపయోగపడేలా హుందాగా ఉండాలని, సొంత ప్రయోజనాల కోసం ఆరాటపడకూడదని, మంత్రి సూచించారు. రైతులను తప్పుదోవ పట్టించే విధంగా ఆందోలనలు చేయించి ఆ ఆందోళనల ద్వారా మళ్లీ అధికారంలోకి రావాలని దురాలోచన చేయడం మంచి పద్ధతి కాదన్నారు. మేం చెప్పిన విధంగా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేసి తీరుతామని, రుణమాఫీ అర్హత ఉండి కాకపోతే సాంకేతిక తప్పిదాలను సరిచేసుకోవాలని సూచించారు. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీచేసే బాధ్యత ఈ ప్రభుత్వానిదని ఎన్ని ఇబ్బందులున్నా రుణమా ఫీ పూర్తిగా చేసి తీరుతామన్నారు. రూ.2లక్షలపైన ఉన్న రుణమాఫీ విషయంలో కేబినేట్‌లో నిర్ణయించి తగిన విధంగాజమచేయడం జరుగుతుందని తెలిపారు.

కీళ్లనొప్పులు.. జ్వరం..!

- ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి పెరిగిన రద్దీ
- ప్రతి ఇంట్లోనూ ఒకరికి జ్వరలక్షణాలు
- రోగులతో కిటకిటలాడుతున్న వార్డులు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 21: ఇటీవల కురిసిన వర్షాలకు... వాతావరణంలో వచ్చిన మార్పులతో ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి రోగుల రద్దీ పెరుగుతోంది. మాతాశిశు కేంద్రం మొదలుకుని పిల్లలు, బాలింతలు పలు అనారోగ్య సమస్యలతో ఆస్పత్రులకు బారులు తీరుతున్నారు. ఉదయం 7గంటల నుంచి ఆస్పత్రి వద్ద జనం పిల్లలు ఎత్తుకుని వస్తున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా చాలా వరకు కీళ్లనొప్పులు .. జ్వరం ఒళ్లు నొప్పులతో, ఊపిరితిత్తుల సమస్యలు (ఉబ్బసంలాంటి)లతో ఆస్పత్రుల పాలవుతున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 350కి పైగా డెంగ్యూ కేసులు కూడా నమోదయ్యాయి. ఖమ్మం జనరల్ ఆస్పత్రిలో ఫీవర్ వార్డులో దాదాపు 70 మందికి పైగా చికిత్స పొందుతున్నారు. అంతే కాదు ప్రైవేట్ ఆస్పత్రుల్లో జనం జనరల్ మెడిసిన్ వైద్యుల వద్ద తాకిడీ పెరుగుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా కీళ్లు.. ఒళ్లు నొప్పులు విపరీతంగా వస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మాత్రలు వేసుకున్నా అది రెండు గంటల కన్నా ఎక్కువగా పనిచేయడం లేదని చెబుతున్నారు.



జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఓపీ వద్ద రోగుల క్యూ

- ఆగస్టులో రోగుల వివరాలు..	
- ఓపీ :	21,032
- ఇన్‌పేషంట్లు :	1937
- బెడ్ కేసులు:	78
- డెంగ్యూ కేసులు:	8

రోజుకు 1,500 లకు పైగానే...!

జిల్లా జనరల్ ఆస్పత్రిలో సాధారణ సమయంలో వెయ్యి నుంచి 1,200 ఓపీ ఉంటుంది. కానీ గత పదిరోజులుగా దీని సంఖ్య 1,500కు పైమాటే ఉంటోంది. ఇంకా రోజురోజుకీ పెరుగుతుందని చెబుతున్నారు. దీంతో పాటు వార్డుల్లో జ్వరపీడితులతో పాటు సాధారణ సమస్యలు కిడ్నీ సమస్యలతో బాధపడే వారు, గుండెకు సంబంధించిన, నరాలకు సంబంధించిన సమస్యలు ఉన్నవారితో కిటకిటలాడిపోతున్నాయి. బెడ్‌లకు సరిపోయే విధంగా రోగులు వైద్య చికిత్సలు పొందుతున్నారు. అ యితే తాము ఏలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సి ద్ధంగా ఉన్నామని ఆస్పత్రి అధికారులు చెబుతున్నారు. వచ్చిన ప్రతి రోగికీ పరీక్షలు నిర్వహించి నివేదికల ఆధారంగా చికిత్సలు చేపడుతున్నామని చెబుతున్నారు. అవసరమైన వారిని ఇన్‌పేషంట్లుగా ఉంచి వైద్యచికిత్సలు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్. కిరణ్‌కుమార్ తెలిపారు.



వార్డులో జ్వరపీడితులు చికిత్స పొందుతున్న దృశ్యం

వైరా అభివృద్ధి కోసం కృషి చేస్తా: ఎంపీ

వైరా, ఆగస్టు 21: ఉమ్మడి ఖమ్మం జిల్లా సహా వైరా నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పేర్కొన్నారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి బుధవారం వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 185మంది బాధితులకు రూ.51లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. తాను ఎంపీగా గెలిచిన తర్వాత తొలిసారి వైరాకు వచ్చానని చెప్పారు. తన గెలుపులో వైరా నియోజకవర్గం కూడా కీలకంగా ఉందని తెలిపారు. తనకు భారీ మెజార్టీ రావడంలో కీలకంగా ఉన్న వైరా నియోజకవర్గ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన గెలుపు కోసం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కూడా ఎంతో కష్టపడ్డారని ధన్యవాదాలు తెలిపారు. తాను ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, ఏ అభివృద్ధి పనినైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సాధిస్తానని పేర్కొన్నారు. రహదారుల అభివృద్ధికి కూడా తనవంతు కృషిచేస్తానని చెప్పారు. ఎంపీని ఎమ్మెల్యే, స్థానికులు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు దాసరి దానియేలు, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మచ్చా బుజ్జీ, పమ్మి అశోక్, పొదిల హరినాథ్, స్వర్ణ నరేందర్, మట్టూరి కృష్ణారావు, లేళ్ల అప్పిరెడ్డి, మిట్టపల్లి నాగి, బీడీకే. రత్నం, రాంపూడి రోశయ్య, ధార్న రాజశేఖర్ పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఖమ్మం రూరల్, ఆగస్టు 21: తెలంగాణ రాష్ట్రం లో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పాలేరు నియోజకవర్గ నిరుద్యోగ అభ్యర్థులను పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు గాను రైట్ ఛాయిస్ అకాడమీ చైర్మన్ మెం డెం కిరణ్‌కుమార్ సహకారంతో ఏర్పాటు చేసిన శీనన్న ఉచిత కోచింగ్‌ను నాయుడుపేటలోని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యం ఏర్పడ్డ తరువాత ఎప్పటికే దాదాపుగా 30వేల పైచిలుకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని అన్నారు. త్వరలోనే 11వేల ఉపాధ్యాయ పోస్టుల నియామకం చేపడతామన్నారు. ప్రతి ఏడాది వివిధ శాఖలలో ఖాళీ అయిన పోస్టులను వెంటనే భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో ఉద్యోగ క్యాలెండర్‌ను కూడా విడుదల చేసినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వ రం గంలోనే కాకుండా ప్రయివేట్ రంగంలో కూడా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహిస్తుందన్నారు. నిరుద్యోగ యువకులు ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంచి ఉద్యోగాలు సంపాదించుకుని జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి పాటు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, గిడ్డంగుల కార్పోరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సీనియర్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, రైట్ ఛాయిస్ అకాడమి చైర్మన్ కిరణ్‌కుమార్, నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, బండి జగదీష్, మద్ది మల్లారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఫ్రీజర్లు రెండే ఉన్నాయా.. ఇబ్బంది కావడం లేదా

- మార్చురీ సందర్శన సందర్భంగా మంత్రి పొంగులేటి
- ఎంపీ నిధుల నుంచి రూ.10లక్షల కేటాయింపు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 21: ఇంత పెద్ద మార్చురీలో రెండు ఫ్రీజర్లా.. మృతదేహాలు పాడవడం లేదా... ఇబ్బంది కావడం లేదా.. ఎందుకిలా ...? అంటూ రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా జనరల్ ఆస్పత్రి అధికారులను ప్రశ్నించారు. బుధవారం ఆయన జిల్లా ఆస్పత్రిలోని మార్చురీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా అక్కడి పరిస్థితులను పరిశీలించి ఒకింత అసహనాన్ని వ్యక్తం చేశారు. మృతదేహాలను భద్రపరిచేందుకు రెండే రెండు ఫ్రీజర్లు ఉండడం పట్ల విస్మయాన్ని వ్యక్తం చేశారు. రెండు ఏలా పనిచేస్తున్నాయి.. ఇబ్బంది అవ్వడం లేదా అని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావును ప్రశ్నించారు. ఆయనతో పాటు ఉన్న ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి స్పందించి తన నిధుల నుంచి రూ 10లక్షలు కేటాయిస్తున్నానని చెప్పారు. వీటితో మరో మూడు ఫ్రీజర్లు కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ఆర్‌ఎంవో ఫోరెన్సిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వినాయక్ రాథోడ్ తదితరులున్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

విద్యార్థులకు బోధనను సులభతరం చేయాలి

- డీఈవో సోమశేఖరశర్మ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సోమశేఖరశర్మ

ముదిగొండ, ఆగస్టు 21: విద్యార్థులకు బోధనను సులభతరంగా చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ సూచించారు. బుధవారం ముదిగొండ జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఐఎఫ్‌టీఎస్ శిక్షణ తరగతులను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అర్థవంతంగా ఉండేలా పాఠాలు బోధించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి తమ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ బుధవారం నేలకొండపల్లిలోని సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒకటి, రెండో తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేసి జవాబులను రాబట్టారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన బోధనాభ్యసన పరికరాలను పరిశీలించారు. పరికరాలను తయారు చేసిన విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయుల పనితీరును మెచ్చుకున్నారు. త్వరలోనే తగినంత మంది ఉపాధ్యాయులను పంపుతామని చెప్పారు. డీఈవో వెంట ప్రధానోపాధ్యాయుడు హరి శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు కావూరి ఫణి వెంట ఉన్నారు.

చట్ట ప్రకారం పిల్లలను దత్తత తీసుకోవాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



దత్తత పత్రాలను ఇస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 21: పిల్లలను చట్ట ప్రకారమే దత్తత తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం ఆయన స్త్రీ-శిశు సంక్షేమ శాఖ ఆధీనంలో ఉన్న ఇద్దరు పిల్లల దత్తత ప్రక్రియను కలెక్టరేట్ ఛాంబర్‌లో చేపట్టారు. దరఖాస్తు చేసిన హైదరాబాద్, ఖమ్మానికి చెందిన దంపతులకు పిల్లలను అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దత్తత అనేది ఒక వరమని, అనాథలైన పిల్లలను తీసుకుని వారికి మంచి భవిష్యత్‌ను ఇవ్వడమే కాకుండా, ఆ పిల్లలకి కూడా తల్లిదండ్రులతో కూడిన కుటుంబాన్ని ఇవ్వడం అనేది చాలా గొప్ప విషయమన్నారు. దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు న్యాయబద్ధమైన బిడ్డగా మారతారన్నారు. దత్తత పిల్లలకి ప్రభుత్వం ద్వారా చట్ట భద్రత కల్పించడం జరుగుతుందన్నారు. చట్ట ప్రకారం మాత్రమే దత్తత తీసుకోవాలని, శిశు గృహలో ఉన్న పిల్లల్ని చట్ట ప్రకారం దత్తతకి ఇవ్వనున్నట్లు తెలిపారు. పిల్లలు దత్తత కావాలనుకున్న ఖమ్మం జిల్లాకు సంబంధించిన వారు మాత్రమే ఖమ్మం శిశు గృహ ద్వారా, బంధుత్వ దత్తత కావాలనుకున్న వారు జిల్లా బాలల పరిరక్షణ విభాగాన్ని సంప్రదించాలని ఆయన అన్నారు.

వైద్యులు అప్రమత్తంగా ఉండాలి

- శిక్షణ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 21: ప్రస్తుత తరుణంలో వైద్యులు, అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని శిక్షణా కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ సూచించారు. బుధవారం ఆయన జిల్లా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన టీ హబ్‌లో రక్త పరీక్షలు, వాటి నమోదు, రోగులకు అందుతున్న సమాచారం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరిన్‌టెండెంట్ డాక్టర్ బి కిరణ్‌కుమార్, ఆర్‌ఎంవోలు డాక్టర్ కళావతి భాయి, డాక్టర్ రాంబా బు, డాక్టర్ వినాయక్ రాథోడ్, హెచ్‌వోడీలు డాక్టర్ సరిత, డాక్టర్ యామిని ల్యాబ్ ఇన్‌చార్జి అశోక్‌రెడ్డి ఉన్నారు.



సమీక్షలో పాల్గొన్న శిక్షణ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ

దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, ఆగస్టు 21: ఎంఎల్‌టీఎంపీహెచ్‌డబ్ల్యూ ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఒక సంవత్సరం క్లినికల్ శిక్షణ కోసం జిల్లాలోని కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హెచ్ వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, బూర్గంపాడు, అశ్వారావుపేట, ఇల్లెందు, చర్లలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ఈ శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. శిక్షణకు ఎంపికైన విద్యార్థులకు వెయ్యి రూపాయలు సంబంధిత ఆసుపత్రుల పేరు మీద డీడీ రూపంలో చెల్లించాలని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకున్న ఎంపికైన వారు తాజాగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

విద్యార్థులు బయోడేటా ఫారంతో పాటు ఆధార్‌కార్డు, పదో తరగతి, ఇంటర్ మార్కుల మెమోలు, స్టడీ సర్టిఫికెట్లను ఐడీఓసీలోని జిల్లా ఇంటర్‌బోర్డు కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

ఉద్యోగులకు అభినందన



ఉద్యోగోన్నతి పొందిన వారిని అభినందిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం, ఆగస్టు21: ఇటీవల ఉద్యోగన్నతి పొందిన వారిని పోలీస్ కమిషనర్ సునిల్‌దత్ తన కార్యాలయంలో బుధవారం అభినందించారు. కమిషనరేట్ పరిధిలో ఏఎస్‌లుగా విధులు నిర్వహిస్తూ వి.చంద్రశేఖర్, బి.పుల్లారావు, కె.నాగేందర్‌రావులు ఎస్‌ఐలుగా, హెడ్‌కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తున్న బి.భస్వనారాయణ, టి.సూర్యనారాయణలు ఉద్యోగన్నతి పొందారు. దీంతో వారిని సీపీ అభినందించారు.

ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారిగా పుల్లయ్య

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 21: ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారిగా డి. పుల్లయ్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఆదిలాబాద్ జిల్లా డీఏవోగా బాధ్యతల్లో ఉండగా బదిలీ చేశారు. ప్రస్తుతం ఖమ్మం వ్యవసాయాధికారిగా ఉన్న ఎం. విజయనిర్మలను మహబూబాబాద్ జిల్లాకు బదిలీ చేశారు.

ఎన్‌ఎల్‌సీఎఫ్ డైరెక్టర్‌గా వెంకటేశ్వర్లు

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు21: నేషనల్ లేబర్ కోఆపరేటివ్ ఫెడరేషన్ డైరెక్టర్‌గా ఖమ్మం త్రీటౌన్‌కు చెందిన కుంచపు వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈమేరకు సంస్థ చైర్మన్ ఎస్ఆర్ కుశలకర్, వైస్ చైర్మన్ కాశీపేట లింగయ్యలు ఢిల్లీలో జరిగిన సమావేశంలో నియామక పత్రం అందించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించడం పట్ల సంస్థ చైర్మన్, వైస్ చైర్మన్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లును పలువురు అభినందించారు.

మల్లవరం అంగన్‌వాడీ టీచర్‌కు జిల్లా స్థాయి పురస్కారం



కలెక్టర్ నుంచి పురస్కారం అందుకున్న సుభాషిణి

తల్లాడ, ఆగస్టు 21: తల్లాడ మండలం మల్లవరం అంగన్‌వాడీకేంద్రం-4 టీచర్ టి.సుభాషిణికి జిల్లాస్థాయి ఉత్తమ పురస్కారం దక్కింది. అంగన్‌వాడీ కేంద్రాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ఉత్తమ సేవలందిస్తున్నందుకు గానూ 2024 సంవత్సరానికి సుభాషిణికి పురస్కారం లభించింది. ఈమేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఆమెకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- చెరువులో మునిగి ఇద్దరు బాలురు మృతి
- శుభకార్యానికి వచ్చి అనంతలోకాలకు



హేమంత్, నిఖిలేష్‌వర్ధన్

కొండపాక/ఇల్లెందు టౌన్, ఆగస్టు 21: శుభకార్యానికి బంధువుల ఇంటికి వచ్చి సరదాగా చెరువులో ఈతకు వెళ్లిన ఇద్దరు చిన్నారులు నీట మునిగి మృత్యువాతపడ్డారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరసనగండ్ల గ్రామానికి చెందిన ఆంజనేయులు ఇంట్లో గురువారం గృహప్రవేశం ఉంది. ఈ శుభకార్యానికి ఆయన బంధువులైన భద్రాద్రి జిల్లా ఇల్లెందు పట్టణంలోని 24ఏరియాకు చెందిన మల్లేశం కుటుంబ సభ్యులు బుధవారం వచ్చారు. ఆంజనేయులు కుమారుడు అరుణ్‌తో కలిసి మల్లేశం కుమారుడు బసవరాజ్ హేమంత్(16), అతని స్నేహితుడు నిఖిలేష్‌వర్ధన్ (13) గ్రామంలోని చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లారు. ముగ్గురూ చెరువులో ఈత కొడుతూ కొద్ది దూరం వెళ్లగానే హేమంత్, నిఖిలేష్‌వర్ధన్ నీటిలో మునిగారు.

ఇది గమనించిన అరుణ్ వారిని లాగే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో కేకలు వేశాడు. సమాచారం అందుకున్న గ్రామస్థులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మృతదేహాలను బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బసవరాజ్ హేమంత్, నిఖిలేష్‌వర్ధన్ మంచి స్నేహితులు. వరుస సెలవులు రావడం శుభకార్యానికి హేమంత్ బంధువుల ఇంటికి ఇద్దరూ కలిసి వచ్చి మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదం నెలకొన్నది. బంధువుల రోదనలు మిన్నంటాయి.

నిందితుడి నుంచి రూ. 50 లక్షలు రికవరీ?

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 21: ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో రూ. కోటి 80లక్షలు ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ సొమ్మును స్వాహా చేసిన ఓ అవుట్‌సోర్సింగ్ అకౌంటెంట్ నుంచి బుధవారం రూ. 50లక్షలు రికవరీ చేసినట్లు సమాచారం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సమగ్ర శిక్షా అభియాన్‌లో జరిగిన నిధుల దుర్వినియోగంలో రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు తనిఖీలు నిర్వహించగా, నిధులు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. దీంతో నిధులు దుర్వినియోగం చేసిన వ్యక్తిని గుర్తించి ఆయనపై ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి ఖమ్మం త్రీటౌన్‌లో కేసు నమోదు చేశారు. నిందితుడుపై కేసు నమోదు కావడంతో అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు వెళ్లగా, అతడికి ఆరోగ్యం బాగాలేదని ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో అతిడిని అదుపులోకి తీసుకోలేదని తెలిసింది.

కాగా నిందితుడు బుధవారం పలువురి సమక్షంలో రూ. 50లక్షలు అందిచినట్లు తెలిసింది. కాగా దీనిపై ఇటు పోలీసులు గాని, విద్యాశాఖ అధికారులుగాని సమాచారం ఇవ్వకపోవడంతో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జ్వరంతో యువకుడి మృతి



ఇర్ఫాన్(ఫైల్)

నేలకొండపల్లి, ఆగస్టు21: జ్వరంతో యువకుడు మృతి చెందిన సంఘటన నేలకొండపల్లిలో జరిగింది. వివరాల ప్రకారం.. నేలకొండపల్లికి చెందిన షేక్. సలాం కుమారుడు షేక్.ఇర్ఫాన్(18) నేలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా గత ఐదు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. అయినప్పటికీ కాలేజీకి వెళుతున్నట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. కాగా బుధవారం ఉదయం ఇర్ఫాన్ ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే చికిత్స కోసం నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలుస్తున్నది.

అనారోగ్యంతో ఏఐటీయూసీ నేత వీరస్వామి..



వీరస్వామి(ఫైల్)

మణుగూరు , ఆగస్టు 21: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో బ్రాంచ్ కమిటీ నాయకుడిగా సుపరిచ తుడైన మాజీ సింగరేణి ఉద్యోగి వీరస్వామి (64) అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ కార్యదర్శి రాంగోపాల్, కమిటీ సభ్యులు వీరస్వామి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడిగా ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడిగా సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె సర్వర్, గడ్డం వెంకటేశ్వర్లు, నాగరాజు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మణుగూరు, ఆగస్టు 21: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యయత్నాకి పాల్పడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఖమ్మంలో చోటు చేసుకుంది. మణుగూరు సీఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం ప్రాంతంలో నివాసముండే అశోక్‌లాల్ కుమారుడు డంగ్రెల్ ఓంకార్ (26) గత ఏడాది మణుగూరుకు చెందిన పుప్పాల ధరణిభవాని అనే యువతిని వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో వారి మధ్య కలహాలు రావడం మొదలు అయ్యాయి. కాగా మృతుడు ఓంకార్ మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని వెంటనే ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ కలహాలతో నా కుమారుడు మృతి చెందాడని మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పాల్వంచలో మనస్తాపంతో వ్యక్తి ..

పాల్వంచ, అగస్టు 21 : మనస్తాపంతోతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాల్వంచలో చోటు చేసుకుంది.. స్థానికుల కథనం ప్రకారం.. వెంకటేశ్వర్లు (40) స్థానికంగా తాపీమేస్రీగా జీవనం సాగిస్తున్నాడు. ఈ మధ్యకాలం లో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మానసికంగా కృంగిపోయాడు. బుధవారం సాయంత్రం ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి హుటాహుటిన అతడిని పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

పాత ఫోన్లు విక్రయించొద్దు: ఏసీపీ

ఖమ్మం క్రైం ఆగస్టు 21: సైబర్ నేరాల్లో వినియోగించేందుకు పాత మొబైల్‌ఫోన్లను వినియోగిస్తున్నారని, వాటిని కొనుగోలు చేసేందుకు గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా సంప్రదిస్తే వారి మాటలను నమ్మవద్దని, అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ ఏసీపీ ఫణిధర్ బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల రామగుండంలో తక్కువ ధరకు ఫోన్లను కొనుగోలు చేసి, వాటి స్థానంలో ప్లాస్టిక్ వస్తువులు లేదా డబ్బులు ఇచ్చి వాటిని కొనుగోలు చేసిన పాత ఫోన్లు ఝార్ఖండ్ రాష్ట్రంలోని జంతార, తదితర ప్రాంతాలకు చెందిన సైబర్ మోసగాళ్లు ఈ మొబైల్ ఫోన్లు సరఫరా అవుతున్నట్లు తెలిసిందని తెలిపారు. దీంతో ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు అప్రమత్తత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఏదైనా సమాచరం ఉంటే సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ నెంబర్ 87126 65556 కు సమాచారం అందించాలని తెలిపారు.

దివాలా పిటిషన్ దాఖలు

ఖమ్మం లీగల్ ఆగస్టు 21: ఖమ్మం నగరం కమాన్ బజార్‌కు చెందిన కండెపల్లి ప్రసాద్ మొత్తం నలుగురిని ప్రతివాదులుగా చూపిస్తూ మొత్తం రూ.47 లక్షలకు దివాలా పిటిషన్ దాఖలు చేశాడు. దివాలా దారుడు బిల్డింగ్ వర్క్స్ వ్యాపార అభివృద్ధి నిమిత్తం బంధువులు, స్నేహితుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తీసుకుని, ఈ వ్యాపారంలో పెట్టుబడి పెట్టాడు. వ్యాపారంలో నష్టం రావడంతో గత్యంతరం లేని పరిస్థితిలో మొత్తం నలుగురిని ప్రతివాదులుగా చూపిస్తూ తన న్యాయవాది ద్వారా ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి కోర్టులో దివాలా పిటిషన్ దాఖలు చేశాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాల్వంచ, ఆగస్టు 21: ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కొమ్ముగూడేనికి చెందిన ఏనిక పాపయ్య(54) ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కంపెనీలో రోజువారీ కూలీగా పని చేస్తున్నాడు. ఈ నెల 13న అదే కంపెనీ పనిమీద విజయవాడ వెళ్లి అక్కడ షట్‌డౌన్ పని చేస్తుండగా పై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. అనంతరం ఇంటికి వచ్చి 18న పాల్వంచలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందాడు. కానీ మరుసటి రోజు మృతి చెందాడు. కంపెనీ వారి అజాగ్రత్త వల్లనే తన తండ్రి మృతి చెందాడని, సదరు కంపెనీ వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం మృతుడి కుమారుడు వీరభద్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధిస్తాం

- పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 21: ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ రూల్స్ త్వరలోనే సాధిస్తామని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం నగరంలోని రోటరీనగర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్వీస్ రూల్స్‌కు సంబంధించి విధి విధానాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారని, దీంతో ఉపాధ్యాయులు, జూనియర్ కాలేజీ అధ్యాపకులుగా, ఎంఈవోలుగా, డిప్యూటీ ఈవోలుగా, డీఈవోలుగా ఏడీలుగా పదోన్నతి పొందటానికి మార్గం సుగమవుతుందని ఉపాధ్యాయుల చిరకాల కోరిక నెరవేరబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కేవలం పీఆర్‌టీయూ సంఘంతోనే సాధ్యమవుతుందన్నారు. అనంతరం వివిధ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు స్వామి, శేఖర్, సోమ్లానాయక్, సుజాత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

దుమ్ముగూడెం, ఆగస్టు21: మండల పరిధిలోని లక్ష్మీనగరానికి చెందిన మాలోజు శివకుమార్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.30వేల విలువగల పదిహేను క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఈ బియ్యం మాలోజు శివకుమార్, లక్ష్మీపురానికి చెందిన అనంతుల రమేష్‌లకు చెందినవిగా గుర్తించారు. తక్కువ ధరకు ప్రజల నుంచి కొనుగోలు చేసి ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సంతల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు ఇరువురు నిందితులు అంగీకరించారని ఎస్ఐ గణేష్ తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎమ్మెల్సీ కోదండరాంకు ఏటీఏ వినతిపత్రం



దుమ్ముగూడెం ఆగస్టు 21: ఆదివాసీ ఉపాధ్యాయుల సమస్యలపై ఏటీఏ రాష్ట్రశాఖ నాయకులు బుధవారం ఎమ్మెల్సీ ప్రొ కోదండరాంను కలిశారు. తొలుత కోదండరాంను సన్మానించారు. గిరిజన సంక్షేమశాఖలో భాషా పండితులు, వ్యాయామ టీచర్ల పదోన్నతి, భద్రాచలం బీఈడీ కళాశాలలో శాశ్వత అధ్యాపక పోస్టులు, ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయ, బోధనేతర సిబ్బంది పోస్టులను మంజూరు చేయాలని, పెండింగు డైట్ బిల్లులను క్లియర్ చేయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీల అభివృద్ధి, ఏజన్సీప్రాంతం ఎస్టీలతో స్థానిక ఉద్యోగాల భర్తీ వంటి అంశాలను ప్రస్తావించారు. రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు, ఏఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సత్యం తదితరులున్నారు.

ప్రతీ ఇంటికి ప్రభుత్వ పథకాలు

- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
- మండలంలో విస్తృత పర్యటన
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కరకగూడెం, ఆగస్టు 21 : రాష్ట్రంలో ప్రతి పేదవారి ఇంటికి ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే పాయం రూ.19 లక్షలతో నిర్మించిన నాలుగు సీసీ రహదారులను ప్రారంభించారు. అనంతరం రూ.21 లక్షల వ్యయంతో నిర్మించినున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కొత్తగూడెం, సమత్ మోతే, చొప్పాల, తుమ్మలగూడెం, అనంతారం, పద్మాపురం పంచాయతీలలో విడివిడిగా గ్రామస్థులతో, మండల స్థాయి అధికారులత సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఆయా పంచాయతీలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చొప్పాల పంచాయతీలో తాగునీటి సమస్య ఉందని మురుగు నీరు వస్తున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తెలపడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను తక్షణమే సమస్య తీర్చాలని తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. వట్టివాగు ప్రాజెక్ట్, పులుసుబొంత ప్రాజెక్టు నిర్మించడం నా చిరకాల కోరిక అని రెండు ప్రాజెక్టులు పూర్తి అయితే సుమారు 10 వేల ఎకరాలకు రెండు పంటలకు సాగు నీరు అందుతాయన్నారు. త్వరలోనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మైనింగ్ డీఈ మండల ప్రత్యేక అధికారి దినేష్, తహసీల్దార్ నాగ



సీసీ రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

ప్రసాద్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో కుమార్, ఇరిగేషన్ ఏఈ సక్రు, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ నాయకులు చందా సంతోష్, పోలెబోయిన శ్రీవాణి, మండల నాయకులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, తోలెం నాగేశ్వరావు, కొమరం కాంతారావు తదితరులు పాల్గొన్నారు. మారుమూల ఏజెన్సీ గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా ఏడూళ్ళ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, కరకగూడెం ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. మందుల గదిని, రోగుల గదిని పరిశీలించిన ఆయన రోగుల వోపీని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో వైద్యులు అందుబాటులో ఉండాలని మారుమూల గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించటమే కాకుండా ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. అనంతరం వైద్యశాల చుట్టు ప్రహరి లేదని వైద్య సిబ్బంది, 108 సిబ్బందికి ఉండేందుకు రూం లేదని ఎమ్మెల్యే దృష్టికి తెలపడంతో పంచాయతీ శాఖ ఏఈని ఎస్టిమిషన్ వేయమని తక్షణమే సమస్య పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి దినేష్, హెచ్ఈ కృష్ణ, ఫార్మసిస్ట్ సునిల్, సిబ్బంది లక్ష్మి, 108 సిబ్బంది అనిత, సాయి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవాగు బ్రిడ్జి పనులపై ఎమ్మెల్యే అసంతృప్తి

మండల కేంద్రంలోని కరకగూడెం చిరుమళ్ల గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగు బ్రిడ్జి మరమ్మతులపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం పెద్దవాగు బ్రిడ్జిని ఎమ్మెల్యే పాయం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల బ్రిడ్జి మరమ్మతులకు రూ.10 లక్షలు మంజూరు చేస్తే అరకొరగా పనులు చేసి చేతులు దులుపుకుంటే ఎలా అని అధికారులను నిలదీశారు. ఇసుక మేటలు, రెండు పాయల మధ్య ఉన్న చెట్లను తొలగిస్తే బ్రిడ్జికి ప్రమాదం తప్పుతదని అధికారులు ఎమ్మెల్యేకు వివరించడంతో కలెక్టర్‌కు సమస్యను వివరించి తక్షణమే ఇసుకను, చెట్లను తొలగించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పాయం తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మైనింగ్ డీఈ ప్రత్యేక అధికారి దినేష్, ఇరిగేషన్ ఏఈ సక్రు, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ నాయకులు చందా సంతోష్, పోలెబోయిన శ్రీవాణి, తోలెం నాగేశ్వరావు, పంచాయితీ అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ శేష జీవితాన్ని ఆహ్లాదంగా గడపాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

కొత్తగూడెం, ఆగస్టు 21: సిటిజన్స్ వారి శేషజీవితాన్ని ఆహ్లాదకరంగా గడపాలని అందుకు ఒంటరితనాన్ని జయించాలని తద్వారా మానసికంగా దృఢంగా ఉంటారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి అన్నారు. బుధవారం ప్రపంచ సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా రాంనగర్ కొత్తగూడెంలో ఉన్న పెన్షనర్‌భవన్‌లో ఏర్పాటుచేసిన న్యాయ చైతన్యకార్యక్రమం మాట్లాడారు. వృద్ధాప్యం శాపం కాదని, వృద్ధులు తమ జ్ఞానం అనుభవంతో మన సమాజాన్ని సుసంపన్నం చేయడంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత వారి కుమారులపైన ఉందని వారి పోషణను చూడకుంటే సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ యాక్టు ప్రకారం ఆర్డీవో కోర్టులో దరఖాస్తును ఇవ్వడం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి. పురుషోత్తం రావు, పెన్షనర్స్ భవన్ చుంచుపల్లి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు పాపన్న, సురేష్, సీనియర్ న్యాయవాది మెండు రాజమల్లు, అసిస్టెంట్ కౌన్సిల్స్ జ్యోతి విశ్వకర్మ, నాగ స్రవంతి, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

గిరిజన బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసిన న్యాయాధికారి

భద్రాచలం, ఆగస్టు 21: భద్రాచలంలోని పోస్టుమెట్రిక్ గిరిజన బాలుర వసతి గృహాన్ని భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి ఎం.వెంకటేశ్వర్లు చైర్మన్ హోదాలో బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనం, పడక గదులు, స్నానపు గదులను పరిశీలించారు. హాస్టల్ వార్డెన్‌ని ఇక్కడ పరిసరాలు శుభ్రంగా ఉండాలని, వంటశాల పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకి పౌష్టికాహారం అందేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.చైతన్య, లీగల్ రిటైనర్ లాయర్స్ పి.వెంకటేశ్వర్లు, పిఆర్ తిరుమలరావు, న్యాయవాది నవీన్‌లు పాల్గొన్నారు.



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న న్యాయాధికారి

కాపు కార్పొరేషన్‌కు రూ.3వేల కోట్లు కేటాయించాలి

చంద్రుగొండ, అగస్టు 21: మున్నూరు కాపు కార్పొరేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.3 వేల కోట్లు కేటాయించాని డిమాండ్ చేస్తూ మున్నూరు కాపు సంఘం జిల్లా ఆడహక్ కమిటీ కో కన్వీనర్ లంకా నరసింహరావు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం మండలంలోని తిప్పనపల్లిలో తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి మౌన నిరసన దీక్ష చేశారు. నరసిహరావు మాట్లాడుతూ మున్నూరు కాపుల అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేయాలని కోరారు. అన్ని జిల్లా కేంద్రాలో భవన నిర్మాణాకు స్థలాలు కేటాయించాలని, బాల బాలికలకు హస్టల్స్ నిర్మించాలని, ఉన్నతవిద్యకు విదేశాలకు వెళ్లే విద్యార్థులకు ఆర్థిక చేయూత అందజేయాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు వనమా రాఘవ పరామర్శ

సుజాతనగర్, ఆగస్టు 21 : సుజాతనగర్ మండలంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తనయుడు వనమా రాఘవ బుధవారం పర్యటించారు. ఈ పర్యటనలోఅనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. సుజాతనగర్‌లోన పెద్దమళ్ల నరేందర్, సీతంపేట బంజరకు చెందిన నెహ్రూలని పలకరించారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన గరికె సాంబయ్య కుటంబాన్ని, బేతంపుడి నాన్యా నాయక్ కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. రాఘవ వెంట బత్తుల వీరయ్య, వేల్పుల దామోదర్, ఎస్కే అన్వర్‌పాషా, జక్కుల సుందర్, వినోద్, తూర్పు ప్రసాద్, పెద్దమళ్ల నరేందర్, వేములపల్లి సత్యన్నారాయణ, బానోత్ లక్ష్మణ్, చిట్లూరి సుధీర్, మామిడాల సాంబశివరావు, మాచిన శ్రీకాంత్, చల్లి రవి, బాలాజీ తదితరులు ఉన్నారు.

గురుకులాల పని వేళలు సవరించాలి: యుటీఎఫ్

భద్రాచలం, ఆగస్టు 21: రాష్ట్రంలో గురుకుల పాఠశాలల పని వేళలు సవరించాలని టీజీ యుటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు అన్నారు. భద్రాచలంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో అమలు చేస్తున్న పని వేళలు శాస్త్రీయంగా లేవని విద్యార్థులను మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురి చేసే విధంగా ఉన్నాయని అన్నారు. గురుకుల ఉపాధ్యాయులకు హెల్తు కార్డులు ఇవ్వాలని, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం చెల్లించాలని కోరారు. అలాగే గురుకుల ఉపాధ్యాయులందరికి 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్, దామోదర్, ఇజీవన్, ఎస్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్ ప్రవేశాలకు అవకాశం

ఇల్లెందు టౌన్, ఆగస్టు 21: తెలంగాణ ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రారంభమయినట్టు ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల కోసం రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించి అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఓపెన్ స్కూళ్ల ద్వారా ఉన్నత విద్య అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజరు అంకుషావలి, కో ఆర్డినేటరు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

జూలూరుపాడు, ఆగస్టు 21: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి బి. వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మండలంలోని వెనుకతండా గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు వ్యాధులపై కళాజాతి నిర్వహించారు. కళాకారులు పాటల ద్వారా ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండ చూసుకోవాలని వైద్యాధికారి ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారుల బృందం లీడల్ కాంపల్లి బాబు, కళాకారుల నందు, నరేంద్ర, స్నేహ, కుమారి, నీలా, కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాయుడు నాదెళ్ల : డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల

పాల్వంచ టౌన్, ఆగస్టు 21: ప్రముఖ వ్యాపారి దివంగత నాదేళ్ల (నవత) వెంకటేశ్వరరావు ఎందరితో ఆదర్శప్రాయుడని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. నాదేళ్ల ప్రథమ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, స్థానిక సీపీఐ నాయకులు, సీపీఎం, టీడీపీ, బీఆర్ఎస్, పలు పార్టీల నాయకులు పలువురు పట్టణ ప్రముఖులు, వ్యాపారులు, కొత్తగూడెం, పాల్వంచ ప్రముఖ వైద్యులు, కృష్ణవేణి కళాశాల డైరెక్టర్లు జగదీష్, వీరేందర్, ప్రిన్సిపాల్ మాచవరపు కోటేశ్వరరావు తదితరులు నాదెళ్ల చిత్రపటానికి పూలమలలు వేసి నివాళులర్పించారు. నాదెళ్ల అల్లుడు ప్రముఖ అర్థోపెటిక్ వైద్యులు డాక్టర్ బిక్కసాని సుధాకర్, నాదెళ్ల కుటుంబసభ్యులకు తమ సంతాపాన్ని తెలిపారు.

సీవీకేరావు సేవలు మరువ లేనివి: హైకోర్టు పీపీ

చర్ల, అగస్టు 21: చింతల చెర్వు వెంకటకృష్ణారావు(సీవీకే రావు) ఏజెన్సీ వాసులకు చేసిన సేవలు మరువ లేనివని రాష్ట్ర హైకోర్టు పీపీ (పబ్లిక్ ప్రాసిక్యూటర్) పల్లె నాగేశ్వరావు గుర్తు చేశారు. బుధవారం చర్ల మండల కేంద్రంలోని సైలజా విహర్‌లో సీవీకేరావు రెండవ వర్ధంతిని నిర్వహించారు. ముందుగా సీవీకేరావు విగ్రహాన్ని పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. పల్లె నాగేశ్వరావు మాట్లాడుతూ, సేవ చేయడంలో సీవీకేరావు ఎప్పుడూ ముందుడేవారన్నారు. విద్యావేత్తగా, కళాకారుడిగా ఆయన అందరి మనస్సులో ఇముడి పోయారన్నారు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, సీవీకే భద్రాచలం ఏజెన్సీ వాసులకు ఎనలేని సేవ చేశారని, నేడు ఆయన అడుగు జాడల్లో ఆయర కుమారుడు హైకోర్టు ప్రముఖ లాయర్ సీవీ సతీష్ కుమార్ నడుస్తున్నారని అన్నారు. అనంతరం వర్ధంతి సందర్భంగా నిరుపేదలకు బట్టలు అందజేశారు. ఈ



మాట్లాడుతున్న పీపీ నాగేశ్వరరావు

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టీపీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, చీమల మర్రి మురళి కృష్ణ, తడికల లాలయ్య ఎంపీడీవో ఈదయ్య, చింతూరి వెంకట్రావు, తాహిసీల్దార్ శ్రీనివాస్‌లు, నీలి నందు, దొడ్డి తాతారావు, చీమకుర్తి భద్రం, పండు, శివరాజు కిషోర్ ఇతరులు ఉన్నారు.

ఏజెన్సీలో ఉపాధ్యాయుల కొరత: ఏటీఏ

పాల్వంచ, అగస్టు 21: ఏజెన్సీ ప్రాంతంలో టీచర్ల కొరత ఎక్కువగా ఉన్నందున డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టుల నియామకం త్వరగా చేపట్టాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బిజ్జా శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పాల్వంచలోని కొమరంభీం భవన్‌లో జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ యాజమాన్యంలో పని చేస్తున్న భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులకు అప్‌గ్రేడేషన్ ద్వారా పదోన్నతులు కల్పించాలని, అప్‌గ్రేడేషన్ అయిన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పోస్టులను మంజూరు చేయాలన్నారు. అనంతరం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ పాల్వంచ మండల శాఖను ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా సిద్దబోయిన వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా పడిగ మురళిలతో పాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు.కార్యంక్రమంలో ఏటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కలం సత్యనారాయణ, అచ్చయ్య, రామకృష్ణ, రాంప్రసాద్, రమేష్, ప్రసాద్, గోపాల్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే మెరుగైన ఫలితాలు: సీపీఐ

కొత్తగూడెం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు చైతన్యవంతమైన పోరాటాలు నిర్వహిస్తేనే మెరుగైన ఫలితాలు లభిస్తాయని నాయకులకు, కార్యకర్తలకు సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. బాబుక్యాంపు ఏరియాలోని సీపీఐ కార్యాలయం రజబ్‌ఆలీ భవన్‌లో బుధవారం జరిగిన కొత్తగూడెం పట్టణస్థాయి కౌన్సిల్ సభ్యులు, వార్డు కౌన్సిలర్లు, ముఖ్యనాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా సమితి సభ్యులు కంచర్ల జమలయ్య కందుల బాస్కర్, వాసిరెడ్డి, మురళీ, వంగ వెంకట్, నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, కౌన్సిలరులు, నాయకులు పిడుగు శ్రీనివాస్, బత్తుల సురేష్ పాల్గొన్నారు.

అరెస్టును నిరసిస్తూ రాస్తారోకో

ఇల్లెందు టౌన్, ఆగస్టు 21: మధ్యాహ్నభోజన కార్మికుల డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు సుభాష్‌నగర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ, సీఐటీయూ నాయకులు అబ్దుల్ నబీ, తాళ్లూరి కృష్ణ, ఆలేటి సంధ్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వనజ, దయావతి, కుమారి, దేవేంద్ర, సరళ, శ్రీలత, శోభ, అంజయ్య, రూతు తదితరలు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే నాగరాజును పట్టించారు

- ఆదివాసీ తుడుందెబ్బ రాష్ట్ర కమిటి కారద్యర్శి

ఆళ్లపల్లి, ఆగస్టు 21: ఆళ్లపల్లి మండలంలో బుధవారం ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన మర్కోడు పంచాయతీ కారదర్శి నాగరాజుపై కొందరు కావాలనే రాజకీయ కక్షతోనే ఏసీబీ అధికారులకు పట్టించారని తుడుందెబ్బ రాష్ట్ర కమిటి కార్యదర్శి, ఆదివాసీ హక్కుల పోరాట సమితి, కొడెం వెంకటేశ్వర్లు ఆరోపించారు. కొందరు వచ్చిన ఏసీబీ అధికారులను ప్రేరెపించి నాగరాజును ఏసీబీ అధికారులకు దొరికేలా చేశారని అన్నారు. 29 శాఖల్లో ఆదివాసీలు ఉద్యోగులుగా పనిచేస్తున్నారని ఇప్పటివరకు ఎక్కడ కూడా లంచం తీసున్నట్టు పట్టుపడలేదు, లంచం తీసుకునే చెడ్డ అలవాటు ఆదివాసీ తెగకు లేదని అన్నారు. జిల్లా అధికారులు మరోసారి జగిరిన సంఘటనను పరిశీలించి నాగరాజు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

భద్రాచలం, ఆగస్టు 21: భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బోగాల శ్రీనివాస రెడ్డి, ఆలం ఈశ్వర్ పాల్గొన్నారు.

అలుపెరగని పోరాటయోధుడు సిద్ది: సీపీఐ

పాల్వంచ టౌన్/మణుగూరు, ఆగస్టు 21 : నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి ఎర్రజెండాతో కడదాకా అలుపెరగని పోరాటం చేసినయోధుడు దివంగత ఉమ్మడి ఖమ్మం జిల్లా సీపీఐ కార్యదర్శి సిద్ది వెంకటేశ్వర్లు అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో సిద్ది వెంకటేశ్వర్లు 2వ వర్ధంతి బుధవారం నిర్వహించారు.

మణుగూరు: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ది వెంకటేశ్వర్లు ద్వితీయ వర్ధంతిని మణుగూరులో పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. పార్టీ నియోజవకర్గ కార్యదర్శి సినియర్ నాయకులు సరెడ్డి పుల్లారెడ్డి సిద్ది వెంకటేశ్వర్లు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించి మాట్లాడారు. వారి ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపనిచ్చారు. నాయకులు సర్వర్, రమేష్, సుధాకర్, రాములు, భీమా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇప్పించాలని వినతి

జూలూరుపాడు, ఆగస్టు 21: వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇప్పించాలని పారిశుధ్య కార్మికులు జూలూరుపాడు మాజీ సర్పంచ్‌విజయని కలిసి విన్నవించారు. బుధవారం జూలూరుపాడులో పంచాయతీ పరిధిలోని పారిశుధ్య కార్మికులు మాజీ సర్పంచ్‌ను కలిసి తమ గోడును వెలబుచ్చుకున్నారు. 45 రోజులు గా వేతనాలు అందకపోవడంతో తీవ్ర అవస్థలు పడుతున్నామని వారు తెలిపారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వేతనాలు అందించేవిదంగా కృషి చేయాలని వారు కోరారు.

వయోవృద్ధులకు హోమియో మందుల పంపిణీ

అశ్వారావుపేట, ఆగస్టు 21: అశ్వారావుపేట హోమియో డిస్పెన్సరీ ఆధ్వర్యంల బుధవారం వయో వృద్దులకు మెడికల్ క్యాంపును నిర్వహించారు. బుధవారం డిస్పెన్సరీ వద్ద జరిగిన మెడికల్ క్యాంపుకి 78 మంది వయోవృద్దులు హాజరై ఉచితంగా మందులను పొందినట్టు డా. దీపిక తెలిపారు. హాజరైన వారిలో ఎక్కువ మంది బీపీ, షుగర్, కీళ్ళనొప్పులుతో బాధపడుతున్నవారు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా. దీపిక, పార్మసిస్ట్ జ్యోతి, ఎస్‌సీఎస్ దిద్దిబాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీని హర్షిస్తూ క్షీరాభిషేకం

దుమ్ముగూడెం ఆగస్టు 21: రుణమాఫీని హర్షిస్తూ మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం దుమ్ముగూడెం సొసైటీ కార్యాలయం వద్ద సోనియా, రాహుల్, రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రుణమాఫీ సమస్యల పరిష్కారం కోసం నోడల్ అధికారులను సైతం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. మండల మాజీ అధ్యక్షుడు అబ్బులు, కుంజా శ్రీను, వెంకటరమణారెడ్డి, రంజిత్, అప్పలరెడ్డి, బాలాజీ, సందీప్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

26నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులు

అశ్వారావుపేట, ఆగస్టు 21: అశ్వారావుపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులు ప్రారంభంకానున్నాయి. ఈనెల 26నుంచి ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభం అవుతాయని జేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్, అశ్వారావుపేటగ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎస్ గోపీ తెలిపారు. తరగతి గదులను పరిశీలించారు. బుధవారం ఆయన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నూతనంగా మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కేటాయించిన గదులను, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనితను కలసి కళాశాలలో సౌకర్యాలును అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ వెల్ఫేర్ అధికారిని కలసి విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని కోరారు. ఈయనతో పాటు కళాశాల అధ్యాపకులు పీర్ సాహెబ్, చెన్నారావు, వీరారెడ్డి పాల్గొన్నారు.

పార్టీ పట్ల అంకితభావంతో పని చేసిన వ్యక్తి తిరుపతయ్య: సీపీఎం

భద్రాచలం, ఆగస్టు 21: సీపీఎం పట్ల అంకితభావం, క్రమశిక్షణ కలిగిన నాయకునిగా పని చేసిన సీఐటీయు మండల కన్వీనరు బర్ల తిరుపతయ్య చేసిన సేవలు మరువలేనివని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బూర్గంపాడులో తిరుపతయ్య స్వగృహంలో సంతాపసభ నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఆర్.వెంకటేశ్వరరావు, ఆర్.నాగేశ్వరరావు, కె.వీరభద్రం, బత్తుల వెంకటేశ్వర్లు, బయ్యా రాము, రాయల వెంకటేశ్వర్లు, పాపినేని సరోజిని, పాల్గొన్నారు.

సింగరేణి సెక్యూరిటీ బదిలీ అధికారికి వీడ్కోలు

మణుగూరు, ఆగస్టు 21: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో సినియర్ సెక్యూరిటీ అధికారిగా ఆరెళ్లనుంచి విధులు నిర్వహించే షబ్బీరుద్దీన్ గోదావరిఖని ఏరియాకు ఇటీవల కాలంలో బదిలీ అయ్యారు. పురస్కరించుకుని ఏరియాలోని ప్రైవేటు సెక్యూరిటీ గార్డులు బుధవారం ఆత్మీయ సభను ఏర్పాటు చేసి షబ్బీరుద్దీన్‌కు వీడ్కోలు పలికారు.

ఎస్సీవర్గీకరణ వద్దు.. ఐక్యతే ముద్దు

- మాలమహానాడు జేఏసీ నాయకులు
- బంద్ ప్రశాంతం

పాల్వంచ టౌన్, ఆగస్టు 12 : ఎస్సీవర్గీకరణ వద్దే వద్దే.. దళితుల ఐక్యతే ముద్దు అని వర్గీకరణ వ్యతిరేకజేఏసీ నాయకులు దాసరి నాగేశ్వరరావు, వాసుమల్లి సుందర్‌రావు అన్నారు. ఎస్సీవర్గీకరణకు వ్యతిరేకంగా జాతీయస్థాయి నాయకత్వం పిలుపులో భాగంగా బుధవారం పాల్వంచలో బంద్ నిర్వహించి ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడారు. ఎస్సీవర్గీకరణకు సుప్రీంకోర్టు ఏడుగురు న్యాయమూర్తుల బెంచ్ ఇచ్చిన తీర్పును తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాలజేఏసీ నాయకులు కాల్వ రామారావు, దారా చిరంజీవి, వీరకుమార్, నామ నవీన్, పుష్పరాజ్, బండి శ్రీను, పి. వెంకటేశ్వర్లు, జి. ప్రభాకర్, శాంతివర్ధన్, కొండలరావు, జి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

●భద్రాచలం: మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం భద్రాచలంలో బంద్ ప్రశాంతంగా సాగింది. దళితుల మధ్య చిచ్చుపెట్టే రిజర్వేషన్లను పూర్తిగా తీసివేసే కుట్ర జరుగుతుందని రాజ్యాంగంలోని ఆర్టికల్ 341లో ఎక్కడ విభజించమని లేదని, సుప్రీంకోర్టు రద్దు చేసే వరకు మాలల ఉప కులాలు



పాల్వంచలో ద్విచక్రవాహన ర్యాలీ



భద్రాచలంలో రాస్తారోకో నిర్వహిస్తున్న మాలమహానాడు నాయకులు

కలిసి పోరాడతామని రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని పేర్కొరు. ఈ కార్యక్రమంలో అల్లాడి పౌల్‌రాజు, దాసరి శేఖర్, దేగల వంశీ, సరెళ్ల వెంకటేష్, డేగల శివ, సాధనపల్లి సతీష్, సూరిబాబు, రాజు, వెంకట్, సందీప్, మున్నా, రాఘవ, శ్రీను, సురేష్ పాల్గొన్నారు.

●చంద్రుగొండలో జరిగిన బంద్‌లో సంస్థ నాయకులు, కార్యకర్తలు వర్గీకరణను వ్యరేకంగా నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. మాలమహానాడు మండల అధ్యక్షుడు బడుగు శంకర్ సంస్థ నాయకులు ఇల్లంగి బాలకృష్ణ, రాయి రాజా, ముత్తయ్య, రాంబాబు, ప్రసాద్, మోహన్‌రావు, పాల్గొన్నారు.

●జూలూరుపాడులో సంఘం నాయకులు గుడిపుడి ప్రభాకర్, ఇల్లంగి తిరుపతి, మందా రంజిత్, కే. సురేస్, వీరస్వామి, ప్రతాప్, పి. గోపాలకృష్ణ, బి.రమేష్, శివ, ఎం.వీరాస్వామి, రాములు, ముత్తయ్య, కమలాకర్, దాసు, జాని, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

●అశ్వాపురం : పినపాక నియోజక వర్గ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం అశ్వాపురంలో రాస్తారోకో నిర్వహించారు. జేఏసి నాయకులు చెట్టి సురేష్,కాల్వ సంసోన్,మేకల బాస్కర్,పిట్టశ్రీనివాస్,ఎన్నా అశోక్,సంగీతరావు,చెలికాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం కొనసాగుతున్న ఆందోళనలు

ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా

దుమ్ముగూడెం ఆగస్టు 21: షరతులు లేని రుణమాఫీను అమలు చేయాలని తెలంగాణా రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాచేశారు. ఎన్నికల ముందు చెప్పినట్లుగా బ్యాంకుల్లో రుణాలు పొందిన ప్రతీ ఒక్క రైతుకూ మాఫీ వర్తింపజేయాలని మండల కార్యదర్శి కొడాలి లోకేష్‌బాబు డిమాండ్ చేశారు. సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షుడు బొల్లి సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యలమంచి వంశీకృష్ణ, కారం పుల్లయ్య, చంద్రయ్య, శ్రీనుబాబు, సాయిబాబు, సమ్మక్క, కామయ్య, ధర్మయ్య పాల్గొన్నారు.



దుమ్ముగూడెంలో ఏఐకేఎస్ ఆందోళన

బీఆర్ఎస్ రాస్తారోకో

దుమ్ముగూడెం: రుణమాఫీ కాని రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేసి, తిరిగి రుణాలివ్వాలని కోరుతూ మండల బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం లక్ష్మీనగరం ఏపీజీవీబీ ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో, ధర్నా చేశారు. మండలంలో మొత్తం 5843 మంది రైతులకు బ్యాంకు రుణాలుండగా, కేవలం 2191 మందికి మాత్రమే మాఫీ ఇచ్చారని మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి తెలిపారు. కార్యదర్శి కణితి రాముడు, జానీపాషా, దామెర్ల శ్రీనివాసు, సీతారామారావు, రామిరెడ్డి, వెంకట్రావు, అప్పారావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదంటూ ఇద్దరు రైతుల ఆందోళన

అశ్వారావుపేట: అశ్వారావుపేట పట్టణ పరిధిలోని పేరాయిగూడేనికి చెందిన నార్లపాటి సిద్దియ్య, నయనవరపు వెంకటేశ్వర్లు అనే రైతులు తమకు బ్యాంకులో ఉన్న అప్పులు మాఫీ కాలేదని, తక్షణమే తమ రుణాలు మాఫీ చేయాలంటూ బుధవారం రింగ్‌రోడ్డు సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. ఈ రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ నేతలు జల్లిపల్లి శ్రీరామమూర్తి, తాళం సూరిబాబు, సత్యవరపు సంపూర్ణ, పణీంద్ర తదితరులు సంఘీభావం వ్యక్తం చేసారు. ప్రభుత్వం అరొరకగ రుణాలు మాఫీ చేసి డాంబికాలు పలుకుతుందని, తక్షణమే ఎటువంటి నిబంధనలు లేకుండా రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

అర్హులందరికి మాఫీని వర్తింపచేయాలని ఎంపీకి వినతి

జూలూరుపాడు: అర్హులైన రైతులందరికి రుణమాఫీని వర్తింపచేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిని కోరారు. బుధవారం వైరాలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌తో కలిసి ఆయనతోపాటు మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఎంపీని కలిశారు. రూ. 2లక్షల్లోపు ఉన్న రైతులందరి రుణాలను మాఫీ చేసి రుణవిముక్తులను చేయాలని కోరారు. రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు దుద్దుకూరి మధుసూధన్‌రావు, దుద్దుకూరి సుమంత్, దారావత్ రాంబాబు, నర్వనేని పుల్లారావు, జువాజీ వీరయ్య, గాదె కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.